ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5 శనివారం 23 నవంబరు 2024



గుంటూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న పెమ్మసాని

పత్తి కొనుగోలు వ్యాపారం కాదు

- పూర్తిగా కొనుగోలయ్యే వరకు కేంద్రాలు పని చేయాలి
- సీసీఐ సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశాలు

6

వీరుల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

- పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



వీరుల ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఊతమిస్తే.. ఉపాధి

8



- పతనావస్థలో ఉపాధి శిక్షణా కేంద్రాలు
- స్వయం ప్రతిపత్తి దశ నుంచి క్షీణ స్థితికి
- నాడు లక్షల్లో టర్నోవర్.. నేడు జీతాల కోసం వెతుకులాట
- కమీషన్ల కోసం కక్కుర్తి, సిండికేట్ జోక్యంతో పతనం
- దశాబ్ద కాలంగా ప్రధాన ఉత్పత్తి యూనిట్లన్నీ మూత
- తుప్పుపట్టిపోతున్న యంత్రాలు, సామగ్రి
- మహిళా ప్రాంగణానికి నాటి వైభవం వచ్చేనా?

రాష్ట్రంలోని రోడ్లకు రెండేళ్లలో కొత్తరూపు



అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

- గత ప్రభుత్వంలో ఎన్‌డీబీ నిధులు పక్కదారి
- అధ్వాన రహదార్లతో రాష్ట్ర ప్రగతికి విఘాతం
- సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లు
- ఆర్ అండ్ బీ శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- మంగళగిరిలో ఎన్‌డీబీ రహదారుల పనులు పునఃప్రారంభం

8

సైనికుల ఊరు.. భావాజీపాలెం



- ఇంటికి ఇద్దరు, ముగ్గురు సైనికులు
- 1980లోనే ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ
- సరిహద్దుల్లో పనిచేయడం గర్వకారణమంటున్న సైనికులు

చోరీ కేసుల్లో తొమ్మిది మంది అరెస్టు

- 18 మోటార్ సైకిళ్లు, 170 గ్రాముల బంగారం, నాలుగు కిలోల వెండి స్వాధీనం

6

నేల బావిలో స్నానానికి దిగి ఇద్దరు శివస్వాముల మృతి

- వినుకొండ మండలం నడిగడ్డలో విషాదం



మురుగునీటి శుద్ధి ప్లాంట్

- టెండర్ల దశలోనే మురుగు నీటిశుద్ధి ప్లాంట్లు
- రూ.151.33 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- స్థలాలు కేటాయించని మున్సిపల్ అధికారులు
- ప్రజారోగ్య పనులనూ పట్టించుకోని పురపాలకులు
- జాతీయ హరిత న్యాయస్థానం ఆదేశాలు బేఖాతర్

నిధులున్నా.. నిర్లక్ష్యం

మురుగు.. మున్సిపాల్టీల్లో ప్రధాన సమస్యగా ఉంది. నీటిని, ఆహార పదార్థాలను, గాలిని కలుషితం చేసేస్తోంది. ప్రజల ఆరోగ్యాలను గుల్లచేస్తోంది. పట్టణాల్లో ఉత్పత్తి అయి పల్లెలను, పొలాలను పాడుచేస్తోంది. పర్యావరణానికి హానికరంగా ఉంటోంది. మురుగునీటితో సాగు వల్ల ఆహార పదార్థాలు విషతుల్యమవుతున్నాయి. ఇలాంటి మురుగును బాగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. మున్సిపాల్టీల వారీగా ప్రత్యేకంగా నిధులు కేటాయించి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల(ఎస్‌టీపీ) నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్‌టీపీల నిర్మాణాలకు టెండర్లు పిలిచారు కానీ పనులు చేపట్టలేదు. మున్సిపాల్టీల్లో వీటి నిర్మాణానికి స్థలాలు చూపడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడటంలేదు. ఎస్‌టీపీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.151.33 కోట్లు నిధులు మంజూరు చేయగా.. స్థలాలు అప్పగిస్తే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నా పురపాలక సంఘాల్లో ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవనే చెప్పాలి. కూటమి ప్రభుత్వంలోనైనా మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులు పట్టాలు ఎక్కాలని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

నిధులు మంజూరు ఇలా..

మున్సిపాల్టీ	కేటాయింపు (రూ.కోట్లలో)
వినుకొండ	18.60
పిడుగురాళ్ల	18.42
చిలకలూరిపేట	69.53
తెనాలి	31.50
బాపట	4.98
చీరాల	8.30

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) మురుగునీటి కాలుష్యాన్ని నివారించేందుకు మున్సిపల్ పట్టణాల్లో చేపట్టాల్సిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ల విషయంలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మురుగు నీటిశుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులు స్థలాల కేటాయింపు దశలోనే ఉన్నాయి. మున్సిపల్ పట్టణాల్లో నిత్యం ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు డ్రెయిన్ల ద్వారా శివార్లకు ప్రవహిస్తోంది. ఈ నీటి వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. మురుగు నీరు చెరువులు, వాగుల్లోకి చేరుతుండటంతో ఆ నీరు కూడా కలుషితం అవుతోంది. పంటల సాగుకు ఈ నీటిని వినియోగిస్తుండటంతో ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయి. నీటి కలుషితాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని రక్షించేందుకు మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించాలని మున్సిపాల్టీలను జాతీయ హరిత న్యాయస్థానం ఆదేశించింది. మున్సిపాల్టీల నుంచి ప్రతి రోజు వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసిన అనంతరమే ఆ నీటిని బయటకు విడుదల చేయాలని సూచించింది. అయితే

పనులు చేపట్టకుండానే..

ప్రజారోగ్యం దృష్ట్యా ఎస్‌టీపీలను వేగవంతంగా నిర్మించాల్సిన మున్సిపల్ అధికారులు పనులు చేపట్టకుండానే చేపట్టినట్టుగా జాతీయ హరిత న్యాయస్థానాన్ని మభ్యపెడుతున్నారు. ఎస్‌టీపీల నిర్మాణం విషయంతో జాతీయ హరిత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. టెండర్లు నిర్వహించి చేతులు దులుపుకున్న అధికారులు పనులు ప్రారంభించినట్లుగా ట్రిబ్యునల్‌ను మభ్య పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. హరిత న్యాయస్థానం ఓ కమిటీని నియమించి ఎస్‌టీపీల నిర్మాణంపై అధికారులు ఇస్తున్న నివేదికలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఎస్‌టీపీల నిర్మాణం విషయంలో పుర పాలకులు సరైన రీతిలో స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. ఎస్‌టీపీలు ప్రతిపాదించిన ఏ ఒక్క మున్సిపాల్టీలో కూడా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. టెండర్లు నిర్వహించి నెలలు గడుస్తున్నా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో..)

సాగు ఎన్నికలకు.. రీషెడ్యూల్

- వచ్చే నెల 5న నోటిఫికేషన్ విడుదల
- 8న నీటి సంఘాలకు, 11న డీసీలకు ఓటింగ్
- 14న ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకునేలా ఉత్తర్వులు



గుంటూరు బ్రాంచ్ కెనాల్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం శుక్రవారం రీషెడ్యూల్‌ను విడుదల చేసింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో 21న విడుదల చేయాల్సిన నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. తాత్కాలికంగా వాయిదా వేసిన ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో వచ్చే నెల 5న ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. 8న సాగునీటి సంఘాలకు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జలవనరుల శాఖ ఏర్పాట్లుచేస్తోంది. సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో 274 సాగునీటి సంఘాలు(డబ్ల్యుయూఏ) ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 12 టీసీల చొప్పున మొత్తం 2,628 టీసీలు ఉన్నాయి. టీసీల వారీగా ఓటర్ల జాబితాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. దాదాపు 7 లక్షల మంది రైతులు ఓటర్లుగా నమోదు చేశారు. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. టీసీలకు 8న ఎన్నికలు నిర్వహించన్నారు. అదే రోజు సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నికుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నికుంటారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. డీసీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటాయి. వీటికి నోటిఫికేషన్‌ను 5న విడుదల చేయనున్నారు.

14న ప్రాజెక్టు కమిటీకి ఎన్నిక

సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీకి 14న ఎన్నికల నిర్వహించనున్నారు. 32 డీసీల అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారులను నియమించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా అధికాలు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక నీటి సంఘాల ఎన్నికలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను అధికారులు కోరారు. రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా స్వీకరిస్తుండటంతో ఏకగ్రీవ ఎన్నికలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎక్కువ నీటి సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి.

డిస్ట్రిబూటరీ కమిటీలు ఇవే..

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. డీసీలను కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. డీసీల వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-12, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గుంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.

7న బాపట్లకు సీఎం చంద్రబాబు

- రాష్ట్రస్థాయి మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరు
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్




హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చే నెల 7న బాపట్లకు రానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే మెగా పేరెంట్- టీచర్ మీటింగ్‌ను బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వేదికగా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ఇప్పటికే జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చింది. సీఎంగా పగ్గాలు చేపట్టాక తొలిసారి జిల్లా కేంద్రం బాపట్లకు రానుండటంతో ఏర్పాట్లపై యంత్రాగాన్ని కలెక్టర్ వెంకటమురళి అప్రమత్తం చేశారు. గతంలో చేనేత దినోత్సవానికి జిల్లా పరిధిలోని చీరాలకు సీఎం చంద్రబాబు రావాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో అది రద్దయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వరదల సమయంలో కూడా సీఎం పర్యటన రెండు సార్లు ఖరారై వాతావరణం అనుకూలించక రద్దైంది. ఈ క్రమంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ కోసం చంద్రబాబు బాపట్లకు రానుండడంతో ఆయన పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి బాపట్ల పర్యటన ఖరారైనట్లు కలెక్టర్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను శుక్రవారం జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్ కొరకు జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని పోలీసు కవాతు మైదానం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా మైదానాలను పరిశీలించారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎస్.పురుషోత్తం, ఆర్డీవో పి.గ్లోరియా, పీడీ కత్తి శ్రీనివాసరావు, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాద రావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

- ఐదు స్కీముల కింద రూ.లక్ష చొప్పున..
- మూడు జిల్లాల్లోని 5,339 కేంద్రాలకు మహర్దశ
- తాగునీరు, మరుగుదొడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం.. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



గుంటూరులో అంగన్వాడీ మరుగుదొడ్డికి రంగులు వేస్తున్న కార్మికుడు



తెనాలిలో తుది దశకు చేరిన అంగన్వాడీ కేంద్రంలోని మరుగుదొడ్డి

అంగన్వాడీలకు.. నిధులు

నిధుల కేటాయింపు ఇలా..

మంచినీటి సదుపాయం	రూ.17,000
మరుగుదొడ్ల నిర్మాణం	రూ.36,000
మరమ్మతులు, రంగులు	రూ.19,800
పెరటి తోట నిర్వహణ	రూ.10,000
వర్షపు నీరు నిర్వహణ	రూ.16,000

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాగునీరు.. మరుగుదొడ్ల సౌకర్యం లేక.. భవనాలు రంగులు వెలసి.. అధ్వానంగా ఉండే అంగన్వాడీ కేంద్రాలు అద్భుతంగా మారనున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, పోషణ అందించే అంగన్‌వాడీ కేంద్రాలు వైసీపీ ఐదేళ్ల పాలనలో అధ్వానంగా మారాయి. వివిధ సమస్యలతో కునారిల్లిపోయిన అంగన్వాడీలకు గత ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. వాటి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఐదు రకాల స్కీముల కింద భారీగా నిధులు కేటాయించింది. ఆయా నిధులతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల తలరాత మారబోతోంది. మూడు జిల్లాల్లో మొత్తం 5,339 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా గత వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా అంగన్వాడీ కేంద్రాలు సమస్యల నిలయాలుగా మారిపోయాయి. కనీస అవసరాలైన మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం కూడా లేని కేంద్రాలు వందల సంఖ్యలో ఉన్నాయి. 2014- 19కి ముందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పెరటి తోటల పెంపకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పెరటి తోటలో మొక్కలు ఎండిపోయినా పట్టించుకోలేదు. చిన్నారుల ఆట వస్తువులు, బొమ్మలకు కూడా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విదిల్చలేదు. దీంతో అంగన్వాడీ కేంద్రాలు అధ్వానంగా తయారయ్యాయి. అవి కేవలం పిల్లలు, తల్లులకు పప్పుబెల్లాలు పంచిపెట్టే కేంద్రాలుగా మారాయి.

- **భారీగా నిధుల కేటాయింపు..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కేంద్రాల్లో పేరుకుపోయిన సమస్యలపై కదలిక వచ్చింది. అంగన్వాడీ కేంద్రాల్లోని సమస్యల పరిష్కారానికి భారీగా నిధులు కేటాయించింది. తక్షణ ప్రాతిపదికన అంగన్వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు చేసింది.

ఆయా కేంద్రాల్లోని తాగునీటి, మరుగుదొడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నిధులు విడుదల చేసింది. పెరటి పంటలకు పోషణ వాటిక కింద నిధులు ఇచ్చింది. వర్షపు నీటి నిర్వహణ పేరుతో కూడా

(మిగతా 8వ పేజీలో..)

- గత వైసీపీ ప్రభుత్వంలో కేసులతో సరి
- ప్రస్తుతం ఆర్ఆర్ యాక్టు కింద చర్యలకు సిద్ధం
- పెనాల్టీతో రూ.49 కోట్ల జరిమానా వసూళ్లపై దృష్టి

ఇసుకాసురుల భరతం పట్టేలా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) సహజవనరుల దోపిడీలో చెలరేగిపోయారు. అధికారం అండతో వ్యవస్థలను ఖాతరు చేయలేదు. కేసులపై వెరపు లేదు.. ఇదీ వైసీపీ హయాంలో ఇసుకాసురులు రెచ్చిపోయిన తీరు. వేమూరు నియోజకవర్గానికి చెందిన కీలక నేత అనుచరుడిపై ఈ ఇసుక అక్రమాల విషయంలో నాలుగు కేసులు నమోదై ఉండడం దోపిడీ ఏ రీతిన సాగిందన్న దానికి నిదర్శనంగా ఉంది. కేసులు నమోదు చేసి జరిమానాలు కట్టమని నోటీసులు పంపినా అప్పట్లో స్పందించలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఇసుకాసురల భరతం పట్టేలా చర్యలకు రంగం సిద్ధం చేసింది. గత ప్రభుత్వంలో జరిగిన ఇసుక దోపిడీ అంశాన్ని అత్యంత ప్రయారిటీగా తీసుకుని పాత కేసులను తవ్వితీసి అక్రమార్కులపై చర్యలు తీసుకునేలా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. వైసీపీ పాలనలో చివరి ఏడాదిలో ఇసుక అక్రమ రవాణా విషయంలో నమోదైన 29 కేసులకు సంబంధించి రూ.9 కోట్ల వరకు జరిమానా కట్టాలి. నిబంధనల ప్రకారం కొన్నింటి విషయంలో వాస్తవ విలువకు పదిరెట్లు, మరికొన్నింటిలో ఐదు రెట్ల వరకు జరిమానా విధించాలి. 29 కేసులకు సంబంధించి రూ.9 కోట్ల జరిమానా కట్టమని అప్పట్లో పలుమార్లు అధికారులు కోరినా స్పందన లేదు. పైగా ఇసుక అక్రమ రావాణా యధేచ్ఛగా చేస్తూ అడ్డుకున్న, ప్రశ్నించిన అధికారులపైనే ఎదురుదాడికి దిగిన ఉదంతాలున్నాయి. కేసులే కదా ఏమవుతుందిలే అన్న ధీమాలో ఉన్న అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టించేలా కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.9 కోట్ల జరిమానాలకు పెనాల్టీ కలిపి మొత్తం రూ.49 కోట్ల వసూలుకు రెవెన్యూ రికవరీ యాక్టు అస్త్రాన్ని అధికారులు ప్రయోగించనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన నోటీసులు కూడా సిద్ధమయ్యాయి. వాటిని త్వరలోనే కేసులు నమోదైన వారికి అందించనున్నారు. ఈ యాక్టు ప్రకారం నిర్ణీత గడువులోగా పెనాల్టీతో కలిపి సదరు మొత్తాన్ని చెల్లించాలి. లేదంటే చర్యలు తీసుకునే వెసులుబాటును ఈ చట్టం కల్పించనుంది. ఈ పెనాల్టీల విషయం చివరికి నేతలను చుట్టుకున్నా ఆశ్చర్యపోవాల్సిందేమి లేదని తెలుస్తోంది.

ప్రభుత్వం పీడీ యాక్టు ప్రతిపాదనలు..

గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇసుక, రేషన్ మాఫియాపై పీడీ యాక్టు ప్రయోగించడానికి కూడా వెనకాడబోమని సాక్షాత్తు హోంమంత్రే చెప్పడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గడచిన ఐదేళ్లలో సహజవనరుల దోపిడీ చేసిన వారితో పాటు ఇప్పటికీ అదేబాటలో ఉన్న వారికి కూడా ఆ ప్రకటన కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ

● బీసీ సంక్షేమశాఖ డీడీ మయూరి

గుంటూరు (విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్స్ పరీక్షకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.మయూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24లోగా గుంటూరులోని బీసీ స్టడీ సర్కిల్‌కు దరఖాస్తులు పంపాలని సూచించారు. అభ్యర్థులకు ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ఉత్తీర్ణులైన వారిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి విజయవాడకు శిక్షణకు పంపుతామని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం సంవత్సరానికి లక్షలోపు ఉండాలని, బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ కాపీలతో గుంటూరు రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని, ఇతర వివరాల కోసం 9959528410 సంప్రదించాలని సూచించారు.

27న డైట్‌లో సంప్రదాయ నృత్య పోటీలు

గుంటూరు (విద్య), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 27న యడ్లపాడు సమీపంలోని బోయపాలెం ప్రభుత్వ శిక్షణా సంస్థ(డైట్)లో జిల్లా స్థాయి బాలరంగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎన్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తప్పెటగుళ్ల, కర్రసాము, చెంచులాట, దింసా, జాలరీ, బంజార అంశాలతో నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. నృత్య సమయం పది నిమిషాలు మించకూడదనీ, ఒక్కో బృందంలో 10 మంది విద్యార్థులు ఉండవచ్చనని తెలిపారు. ఇతర వివరాలకు డాక్టర్ కృష్ణప్రసాద్ డైట్ లెక్చరర్(8019207528)ను సంప్రదించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులను ప్రోత్సహించాలని జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు ప్రిన్సిపల్ చంద్రకళ విజ్ఞప్తి చేశారు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా తెలిపారు. ఈ సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తోపాటు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు అవుతారని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖలపై చర్చ జరుగుతుందని వెల్లడించారు.

గల్లంతైన బాలికల్లో యామిని మృతదేహం లభ్యం



ఈపూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ల సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో గురువారం గల్లంతైన ఇద్దరు బాలికల్లో పెద్ద పాప యామిని (10) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఉదయం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలిస్తుండగా కాలువలో పడిన దగ్గరలో మృతదేహం నీటిపైకి తేలింది. చిన్న పాప కావ్య(7) ఆచూకీ లభ్యం కాలేదు. సాయంత్రం వరకు కాలువలో గాలించారు. యామిని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు.

పత్తి కొనుగోలు అనేది వ్యాపారం కాదు

● రైతులను ఆదుకోవడానికి కేంద్రం ఏర్పాటు చేసిన బాధ్యత

● కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్షలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉత్పత్తి చేసిన పత్తిని సీసీఐ అధికారులు మార్చి నెల చివరి దాకా తప్పక కొనుగోలు చేయాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్లపై సీసీఐ కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యం, రైతుల ఆందోళనపై సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు యాజమాన్యాలు, రైతులతో కేంద్ర మంత్రి పెమ్మసాని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ గత వారం రోజులుగా పత్తి కొనుగోలుపై సీసీఐ కేంద్రాల్లో జరుగుతున్న ఆలస్యం, అందుకు ఆందోళన వెలిబుచ్చుతున్న రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరించే క్రమంలో ఈరోజు సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పత్తి కొనుగోలు అనేది వ్యాపారం కాదు, రైతులను ఆదుకోవడానికి ఏర్పాటు చేసిన ఒక బాధ్యత అని తెలిపారు. ఉత్పత్తి అవుతున్న పత్తి పూర్తిగా కొనుగోలు అయ్యే వరకు సీసీఐ కేంద్రాలు పని చేయాలని సూచించారు. పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న పరిణామాలపై అనేక ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. రైతు తనంతట తానుగా దళారులకు అమ్మేలా చేసి, ఆ తర్వాత దళారులు ఆ పత్తిని సీసీఐకి విక్రయించేలా చేస్తున్నారని చెప్పారు. ఈ విధంగా వచ్చే మొత్తాన్ని పంచుకోవడానికే ఇలా జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా పత్తి అమ్మకంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

నాలుగు అంశాలపై సానుకూల స్పందన

అనంతరం మీడియాతో మాట్లాడుతూ సమీక్షలో ముఖ్యంగా నాలుగు అంశాలపై సీసీఐ అధికారులు సానుకూలంగా స్పందించి అందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారన్నారు. 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద 61 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. అందుకు సానుకూలంగా అధికారులు స్పందించారు. ప్రస్తుతం సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి, శనివారం కూడా కొనుగోళ్లు జరపాలని సీసీఐ అధికారులను కోరగా అందుకు వారు అంగీకరించారని తెలిపారు. పత్తి అమ్మకానికి సంబంధించి డాక్యుమెంటేషన్‌కు వేలిముద్రలు వేయడానికి సాయంత్రం 6 గంటల వరకే వెసులుబాటు ఉండటంతో రైతులకు ఇబ్బందికరంగా ఉందనీ, ఈ సమయాన్ని రాత్రి 7.30 గంటల వరకు పొడిగించేలా చూడాలని సీసీఐ అధికారులకు స్పష్టం చేయగా, అందుకు వారు ఒప్పుకున్నారన్నారు. పత్తి బోరాలు తెచ్చే విధానం, లోడింగ్ చేసే పద్ధతి, వాతావరణం పలు అంశాలలో ఉన్న తేడాల వలన తేమ పరీక్షల్లో విభిన్న ఫలితాలు తలెత్తుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయం చేసుకుని రైతులను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ మాదిగ సంక్షేమ సహకార సంస్థ లిమిటెడ్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, జిల్లా రెవెన్యూ అధికారి షేక్. ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, సీసీఐ డైరెక్టర్ మార్కెటింగ్ విజయ్ కురదాగి, మార్కెటింగ్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరక్టర్ రాజబాబు, గుంటూరు మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అమర్నాధ్ రెడ్డి, జిన్నింగ్ మిల్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మాతృమూర్తిని మానవత్వం ఆదుకుంది

● అమ్మను రోడ్డుపై వదిలి వెళ్లిన పిల్లలు

● చలికి వణికిపోయిన తల్లి

● సబ్‌కలెక్టర్ ఆదేశాలతో నిర్మల్ హృదయ్ స్వచ్ఛంద సంస్థకు తరలింపు



వృద్ధురాలిని పరిశీలిస్తున్న నిర్మల్ హృదయ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

తెనాలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి భారమైందనుకున్నారేమో ఆ కుమారులు.. బాల్యంలో మలమూత్రాలు శుభ్రం చేసి స్నానం చేయించి లాలిపాటలతో గోరుముద్దలు తినిపించిన ఆ చేయి వృద్ధాప్యంలో భారంగా మారిందనుకున్నారో ఏమో.. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న బిడ్డలే నడిరోడ్డుపై వదిలేసి వెళ్తుంటే ఆ తల్లి ఎంత తల్లడిల్లి ఉంటుందో.. తెనాలిలో శుక్రవారం వెలుగుచూసిన ఓ వృద్ధురాలి ఉదంతం ఇది. తెనాలి నాలుగు వరుసల రోడ్డులో మార్కెట్ వంతెన వద్ద ఫుట్‌పాత్‌పై సరైన వస్త్రాలు లేక చలికి గజగజా వణుకుతూ అల్లాడిపోతున్న 92 ఏళ్ల వృద్ధురాలిని హెల్పింగ్ సోల్జర్స్ టీం సభ్యులు గుర్తించారు. సరైన ఆహారం తీసుకోక నీరసించి అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలి బాధను చూడలేక మంచినీరు, ఆహారం అందించారు. దుస్తులు కప్పి పక్కనే ఉన్న బస్‌షెల్టర్‌లో ఉంచి చలికి తట్టుకునేలా కోటు ఇచ్చారు. ఆమె కొంత కోలుకునేలా సపర్యలు చేశారు. వృద్ధురాలి పేరు అంజమ్మ అని తనది తెనాలిలోని చెంచుపేట అని చెప్పింది. తమ పిల్లలే తనను ఆటోలో తీసుకువచ్చి గురువారం రాత్రి ఇక్కడ వదిలేసి వెళ్లిపోయారని కన్నీటి పర్యంతమైంది. ఇంటి అడ్రస్, ఇతర వివరాలు చెప్పేందుకు ఆమె ఇష్టపడటంలేదు. ప్రస్తుతం ఆమె నడిచే స్థితిలో కూడా లేదు. వృద్ధురాలి బాధను స్థానిక అధికారులకు, మీడియా దృష్టికి హెల్పింగ్ సోల్జర్స్ టీం సభ్యులు తీసుకు వెళ్లారు. దీంతో స్పందించిన సబ్ కలెక్టర్ సంజన సిన్హా తహసీల్దార్ గోపాలకృష్ణను, మున్సిపల్ అధికారులను ఆమె సంరక్షణ చర్యలపై ఆదేశించారు. దీంతో గుంటూరుకు చెందిన నిర్మల్ హృదయ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి వృద్ధురాలి సంరక్షణాబాధ్యతలను వారికి అప్పగించారు. వృద్ధురాలి పట్ల మానవత్వం చాటిన హెల్పింగ్ సోల్జర్స్ ప్రతినిధులను తహసీల్దార్ గోపాలకృష్ణ, పలువురు అధికారులు, మానవతావాదులు అభినందించారు. వృద్ధురాలిని రోడ్డుపై విడిచివెళ్లిన కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నామని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గోపాలకృష్ణ స్పష్టం చేశారు.

చోరీ కేసుల్లో తొమ్మిది మంది అరెస్టు

నరసరావుపేట లీగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన 18 మోటార్ సైకిళ్లు, 170 గ్రాముల బంగారం, నాలుగు కిలోలు వెండి, పదివేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి 6 కేసుల్లో నిందితుడైన షేక్ సుభానిని అరెస్టు చేసి 170 గ్రాములు బంగారం, నాలుగు కిలోల వెండి, పది వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. సుభాని పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలో చోరీలకు పాల్పడ్డాడు. అయినవోలు పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ఎనిమిది మోటార్ సైకిళ్లను చోరీ చేసిన లింగం యలమంద, కొమ్మిరి శెట్టి రామాంజనేయులులను అరెస్టు చేశారు. ఈపూర్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి కొండ్రముట్ల గ్రామ సచివాలయంలో చోరీకి పాల్పడిన జరపాల వెంకటేశ్వర్ నాయక్, భూక్య బాలాజీ నాయక్, పొడివలస గణపతులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 4 లక్షలు విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి పది మోటార్ సైకిళ్లను చోరీ చేసిన మట్టపల్లి హరిబాబు, చల్లా భవాని శంకర్, షేక్ మస్తాన్‌వలిలను అరెస్టు చేశారు. కేసుల దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన అధికారులను ప్రశంసించారు. వారికి రివార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకు పోలీస్ వ్యవస్థ

ప్రజల చెంతకు పోలీస్ వ్యవస్థను తీసుకువెళ్లటానికి పోలీస్ సేవలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి త్వరలో 'మీతో మేము' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

ప్యాసింజర్ రైళ్ల నంబర్లు మార్పు

● జనవరి 1వ తేదీ నుంచి అమలు

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లుగా నడుపుతున్న రైల్వే శాఖ వాటి నంబర్లను జనవరి 1వ తేదీ నుంచి మార్పు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ. శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రస్తుత నంబరు	రైలు	కొత్త నంబరు
07464	విజయవాడ-గుంటూరు	67769
07465	గుంటూరు - విజయవాడ	67770
07277	మిర్యాలగూడ - నడికుడి	67777
07973	నడికుడి - మిర్యాలగూడ	67778
07974	మిర్యాలగూడ - కాచీగూడ	67776
07791	కాచీగూడ - నడికుడి	67779
07792	నడికుడి - కాచీగూడ	67780
07279	విజయవాడ - తెనాలి	67213
07575	తెనాలి - విజయవాడ	67214
07786	గుంటూరు - రేపల్లె	67223
07787	రేపల్లె - గుంటూరు	67234
07889	రేపల్లె - మార్కాపురం రోడ్డు	67238
07282	తెనాలి - గుంటూరు	67236
07628	విజయవాడ - గుంటూరు	67229
07629	విజయవాడ - తెనాలి	67221
07630	తెనాలి - విజయవాడ	67222
07781	విజయవాడ - మాచర్ల	67227
07782	మాచర్ల - విజయవాడ	67228
07864	గుంటూరు - విజయవాడ	67230
07873	రేపల్లె - తెనాలి	67224
07874	తెనాలి - రేపల్లె	67231
07875	రేపల్లె - తెనాలి	67232
07876	తెనాలి - రేపల్లె	67233
07887	గుంటూరు - తెనాలి	67235
07888	తెనాలి - రేపల్లె	67237
07890	మార్కాపురం రోడ్డు - తెనాలి	67239
07281	నరసపూర్ - గుంటూరు	67247
07784	గుంటూరు - రేపల్లె	67249
07785	రేపల్లె - గుంటూరు	67250
07976	గుంటూరు - విజయవాడ	67248
07783	విజయవాడ - గుంటూరు	57201
07788	గుంటూరు - విజయవాడ	57202
07579	నడికుడి - మాచర్ల	57205
07580	మాచర్ల - నడికుడి	57206
07779	గుంటూరు - మాచర్ల	57203
07780	మాచర్ల - గుంటూరు	57204


రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం

తెనాలి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులు దుర్మరణం పాలైన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం తూములూరు గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి (50), భార్య సురేఖ, కుమారుడు హరినాథ్‌రెడ్డి (19) కలిసి ద్విచక్రవాహనంపై నంబూరు వెళ్తున్నారు. ఇదే క్రమంలో హాఫ్‌పేట - ఖాజీపేట మధ్యలో ఎదురుగా వస్తున్న లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. తండ్రి, కొడకులు ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా సురేఖకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా హరినాథ్‌రెడ్డి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రవీంద్రారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్సపొందుతూ రవీంద్రారెడ్డి కూడా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భర్త, కుమారుడిని కోల్పోయిన సురేఖ రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. హరినాథ్‌రెడ్డి ఐటీఐ చదువుతుండగా నంబూరులో స్థిరపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.


బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

దాచేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దాచేపల్లి నాగులేరు బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. శుక్రవారం నారాయణపురం గ్రామానికి చెందిన బండ్ల మహేష్(18) ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తూ దాచేపల్లి నుంచి నారాయణపురం వస్తున్నాడు. ఈ క్రమంలో బస్సును స్వల్పంగా ఢీకొట్టగా బండి అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌కు తగిలింది. బండి పైనుంచి కిందపడిన యువకుడి తలకు బలమైన గాయాలయ్యాయి. మృతునికి వివాహం కాలేదు. కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దాచేపల్లి ఎస్‌ఐ సౌందర్‌రాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేల బావిలో స్నానం చేస్తూ ఇద్దరు శివస్వాములు మృతి



రామకృష్ణ(ఫైల్)



మల్లికార్జున (ఫైల్)

వినుకొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు శివ మాలధారణ యువకులు మృతి చెందిన సంఘటన మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని నాగార్జునసాగర్ కాల్వ వద్ద గల ఆరోక్య అరుణ్ పంట పొలంలోని నేల బావిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఒంటేరు రాంబాబు చేసిన పడిపూజ కార్యక్రమంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాలధారణ స్వాములు అందరూ బిజీబిజీగా గడిపారు. సద్ది అనంతరం మిగిలిన పనులు పూర్తి చేద్దామని శివమాల ధరించిన కామస్వామి రామకృష్ణ (27), జెట్టి మల్లికార్జున(22) స్నానానికని నేలబావి వద్దకు వెళ్లారు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ బావిలో మృతి చెందారు. ఆ సమయంలో అక్కడ ఉన్న నాగరాజు, నరసింహారావు గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు బావి వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న వినుకొండ రూరల్ సీఐ శోభనబాబు, తహసీల్దార్ సురేష్ నాయక్, ఫైర్ అధికారి నాగేశ్వరరావు సిబ్బందితో బావి వద్దకు చేరుకున్నారు. సుమారు 30 అడుగల లోతులో ఉన్న నీటిని 6 ట్రాక్టర్ల సహాయంతోపాటు ఫైర్ అధికారులు తమ వద్ద ఉన్న యంత్రాలతో రాత్రి 8 గంటల వరకు నీటిని తోడి మృతదేహాలను గుర్తించి వెలికితీశారు. మృతుడు రామకృష్ణకు ఏడాది క్రితం వివాహం జరిగింది. ఒక కుమార్తె ఉంది. ఇరువురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం చేసేందుకు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సీఐ శోభనబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమాఖ్య కార్యాలయాన్ని చుట్టుముట్టిన మహిళలు



వినతి పత్రం అందజేస్తున్న బాధిత మహిళలు

అమరావతి, నవంబరు 22: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని అత్తలూరు, ధరణికోట గ్రామాల్లోని మహిళా సంఘాల్లో రూ.55 లక్షలు గోల్‌మాల్ అయ్యాయని, తమకు న్యాయం చేయాలని సంబంధిత సంఘాల సభ్యులు శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయాన్ని చుట్టుముట్టి మండల సమాఖ్యకు వినతి పత్రం అందజేశారు. ధరణికోట గ్రామంలో 185 మహిళా సంఘాలు ఉండగా ఆరుగురు యానిమేటర్‌లు ఉన్నారు. అత్తలూరు గ్రామంలో 100 మహిళా సంఘాలు ఉండగా ముగ్గురు యానిమేటర్‌లు ఉన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న స్త్రీనిధి రుణాలు చెల్లించి మళ్లీ రుణాలు పొందేందుకు మండల సమాఖ్య వద్దకు వెళ్లగా వారు తీసుకున్న రుణాలు చెల్లించనట్లు ఉంది. దీంతో సభ్యులు ఆందోళన చెంది తాము రుణాలు చెల్లించినప్పటికీ తమ పేరు మీద అప్పులు ఉండటం ఏమిటని మహిళలంతా మండల సమాఖ్య అధ్యక్షురాలు చింకా నాగలక్ష్మికి వినతి పత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై విచారణ జరిపి బాధిత మహిళలకు న్యాయం చేస్తామని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని నాగలక్ష్మి తెలిపారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం

(5 పేజీ తరువాయి)

ఎస్‌టీపీల నిర్మాణాన్ని గాలికొదిలేసింది. జాతీయ గ్రీన్‌ట్రిబ్యునల్ మొట్టికాయలు వేసినా గత వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. మున్సిపాలిటీలలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు స్థలాలను కేటాయించలేదు. పనులు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం ఎస్‌టీపీల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ పరిస్థితుల్లో ప్రజారోగ్యం దృష్ట్యా ఎస్‌టీపీల పనులు వేగవంతంగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను అధికారులు గుర్తించాలి. స్థలాలను కేటాయించి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి.

తెనాలిలోనే పనులు..

గుంటూరు జిల్లాలో ఒకటి, పల్నాడు జిల్లాలో మూడు, బాపట్ల జిల్లాలో రెండు మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపి నిధులు విడుదల చేసింది. అయితే కొన్ని మున్సిపాలిటీల్లో అమృత్ పథకానికి ఈ ఎస్‌టీపీలను అనుసంధానం చేశారు. అయితే మూడు జిల్లాల్లో ఆరు మున్సిపాలిటీలకు ఒక్క గుంటూరు జిల్లా తెనాలిలో మాత్రమే మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు జరుగుతున్నాయి. తెనాలిలో అమృత్ పథకం కింద రూ.31.50 కోట్లతో పనులు చేస్తున్నారు. వినుకొండ మున్సిపాలిటీలో ముట్లకుంటకాలనీ ప్రాంతంలో 5.70 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఈ స్థలంలో కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. వినుకొండలో చెక్కవాగు నిర్మల స్కూల్ ప్రాంతంలో 5.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మరో ప్లాంట్ నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. వీటికి రూ.18.60 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పిడుగురాళ్లలో రూ.18.42 కోట్లతో 5.90 ఎంఎల్‌డీ సామర్థ్యంతో హనుమందిర్ రోడ్డులో, 5.20 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్సీ శ్మశానవాటిక సమీపంలో మరో ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించారు. ఆయా ప్రాంతాల్లో ప్లాంట్ల నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. ఈ రెండు మున్సిపాల్టీలలో నాలుగు ఎస్‌టీపీల నిర్మాణ పనులు టెండర్‌ను శ్రీకృష్ణ ఎస్‌వీరో ఇంజనీర్స్ విజయవాడ సంస్థ దక్కించుకుంది. చిలకలూరిపేట మున్సిపాల్టీలో అమృత్ పథకంలో భాగంగా రూ.69.53 కోట్లతో చేపట్టిన ఎస్‌టీపీ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. బాపట్ల జిల్లా బాపట్ల మున్సిపాల్టీలో రూ.4.98 కోట్లతో 3 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ఎస్‌టీపీని కంపోస్టు యార్డు ప్రాంతంలో నిర్మించాలి. ఇందుకు సంబంధించి స్థలం కేటాయింపు జరగలేదు. చీరాల మున్సిపాల్టీలో రూ.8.30 కోట్లతో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఐకేనగర్ దండుబాట ప్రాంతంలో నిర్మించాలని స్థలాన్ని గుర్తించారు. అయితే స్థల కేటాయింపు మధ్యలోనే నిలిచిపోయింది. ఈ రెండు మున్సిపాల్టీలలో ఎస్‌టీపీల టెండర్‌ను సింగస్ ప్రాజెక్టు లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ దక్కించుకుంది.

వీరుల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

● జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

కారంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో నిర్వహించనున్న వీరుల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వీరుల దేవాలయంలో జరుగుతున్న ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పల్నాటి చరిత్రను పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వీరులు ఉపయోగించిన ఆయుధాలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్, కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్‌ఐ వాసు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

45,111 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 36,839 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,111 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 29,101 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500	334	8000	13000
నెంబరు. 5	8000	14000	నెంబరు. 5	11000	13000
273	10000	13000	273	8500	12200
341	8000	15500	341	8000	15000
4884	-	-	4884	9000	14000
సూపర్ 10	-	-	సూపర్ 10	9000	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	8000	16500
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	7500	12500
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	9500	13500
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	4500	11000

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం

బాపట్ల,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి శుక్రవారం బహుమతులు ప్రదానోత్సవం చేశారు. బాపట్ల శాఖా గ్రంథాలయంలో జరిగిన ఈకార్యక్రమానికి ఛైర్మన్ డాక్టర్ శరత్ బోస్ ముఖ్యఅతిథిగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత, పుస్తకపఠనం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ చిలుకూరి వీర వెంకట సత్యనారాయణ, శివాజీగణేశన్, వంకాయలపాటి హరిబాబు, ఎల్.వెంకట్రావు, ఎస్.వసుదేవరావు, తోట రామాంజనేయులు, కోలా సుబ్బారావు, మద్దిన ప్రసన్నాంజనేయులు, కోలా పద్మజ, సి.హెచ్.కేశవులు, కర్ణం రవీంద్ర, జీవి, గురుజాల శ్రీనివాసరావు, నాగలక్ష్మీ, ఉమామహేశ్వరరావు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కర్లపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రత ద్వారా 80 శాతం వ్యాధులు నియంత్రించవచ్చునని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వేణుమాధవ్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో శుక్రవారం పారిశుధ్య కార్మికురాలు శివమ్మను సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్ మాట్లాడుతూ సబ్బుతో చేతులు కడుకున్నప్పుడు చేతిగోళ్ళు సందుల్లో ఎలాంటి మురికి లేకుండా ఉండేలా శుభ్రంగా కడుక్కొన్ని ఆహారాన్ని తీసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎస్ఐ ప్రతినిధి వి.భగవాన్‌దాస్, పాఠశాల ఉపాధ్యాయులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం యూటీఎఫ్ అధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు


వై.శ్రీనివాసరావు

రేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఉపాధ్యాయ సంక్షేమంకోసం యూటీఎఫ్ పాటుపడుతుందని జిల్లా అధ్యక్షుడు జే.వినయ్‌కుమార్ అన్నారు. నిజాంపట్నం యూటీఎఫ్ మండల కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్వర్ణోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రకౌన్సిలర్ సిహెచ్ తాతయ్య మాట్లాడుతూ అప్రెంటీస్ రద్దు, రీగ్రూప్ స్కేల్ సాధించటంలో యూటీఎఫ్ చేసిన కృషి అభినందనీయమన్నారు. అనంతరం నిజాంపట్నం మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎండి హుస్సేన్, గౌరవాధ్యక్షుడిగా సిహెచ్ గణేష్‌రావు, సభ్యులుగా ఓ.నాగరాజు, ఎన్.సుధారాణి, కోశాధికారిగా యూ.కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూటిఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ బాపయ్య ఎన్నికల అధికారిగా, పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్ హాజరయ్యారు.

బెల్లపు ఊట ధ్వంసం

రేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో నాటుసారా తయారు చేస్తే వారిపై క్రిమినల్‌కేసులు నమోదు చేస్తామని నగరం ఎక్సైజ్ సిఐ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలంలోని దిండి పంచాయతీ పరిధిలోని జంపానివారిపాలెం గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలో ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తే ఉపేక్షించేదిలేదని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది కె.వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో ఐదు గోల్డు మెడల్స్ సాధించిన క్రీడాకారులు

రేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యలో రాణిస్తూ తైక్వాండో రంగాన్ని ఎంచుకుని క్రీడల్లో బంగారు పతకాలను సాధించటం అభినందనీయమని తైక్వాండో జిల్లా సెక్రటరీ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలులోని షాదీఖానా భవనంలో 17న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నిజాంపట్నం క్లబ్ నుంచి బాలబాలికలు 20 మంది పాల్గొనగా వారిలో ఐదు గోల్డ్ మెడల్స్ 9 సిల్వర్, ఆరుబ్రాంజ్‌మెడల్స్ సాధించారు. తైక్వాండో క్రీడాకారులను టీమ్ కోచ్ శివారెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ బి.బాబూరావు, సిరాజుద్దీన్‌ఖాన్, పి.బాజీ, ఎం.శ్రీనివాస్‌రావు అభినందించారు.

బాపట్ల ఏఆర్ డీఎస్పీగా విజయసారధి

గుంటూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఏఆర్ డీఎస్పీగా పి.విజయసారధి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కోనసీమ జిల్లా ఏఆర్ డీఎస్పీగా కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు బాపట్ల ఏఆర్ డీఎస్పీగా ఉన్న ఎస్.చంద్రమోహన్‌ను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా డీఎస్పీగా నియమించారు.

గ్రీవెన్స్‌కు వచ్చిన గిరిజనులకు అల్పాహారం అందజేత

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో గిరిజనుల కోసం శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌కు వచ్చిన వారికి బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీవారు అల్పాహారం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి ఆహారం అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణరాజు, రమణబాబు, రామచంద్రమూర్తి, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులజనగణనకు ములాయం సింగ్ యాదవ్ అవిరళకృషి

● సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేడా

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కుల జనగణన కొరకు ములాయిసింగ్‌యాదవ్ అవిరళ కృషి చేశారని సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేడా శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మేడా కాలేజి ఆవరణంలో శుక్రవారం ములాయిసింగ్ 85వ జయంతి నిర్వహించారు.

ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లంబు సాంబయ్య, కాండ్రు శరత్ కుమార్, సోహిత్‌యాదవ్, కొమ్మనబోయన ఫణీంద్రకుమార్, గవిని నారాయణ, మణికుమార్, కటకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిశోర బాలికలలో రక్తహీనత అరికట్టాలి : కలెక్టర్


కిశోరి వికాసంపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి తదితరులు

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికలలో రక్తహీనత పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమంపై జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ కిశోర బాలికల విద్య, ఎదుగుదల, ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాలను పూర్తి స్థాయిలో అరికట్టాలన్నారు. ఇబ్బందులలో ఉన్న బాలికలను గుర్తించి వారికి ధైర్యం చెప్పాలని సూచించారు. బాలికలలో నైపుణ్యాల వృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. ఇందుకోసం ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో సదస్సులు నిర్వహించాలన్నారు. ఈనెల 27 నుంచి 30వ తేదీలోగా శిక్షణలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో స్త్రీశిశు సంక్షేమశాఖ జిల్లాఅధికారిణి కె.ఉమా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గృహానికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఖచ్చితంగా ఉండాలి : కలెక్టర్

ప్రతి గృహానికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. డిసెంబరు 10వ తేదీ వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించి మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరించాలన్నారు. అధికారులచే కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, సీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుడు మరణిస్తే జీవిత భాగస్వామికి పెన్షన్

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద ఇప్పటికే ఉన్న పింఛన్‌దారు మరణిస్తే జీవిత భాగస్వామికి పెన్షన్ మంజూరు చేయబడుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ప్రతినెల పెన్షన్ పంపిణీ పూర్తి అయిన తర్వాత చెల్లించని పెన్షనర్ల వివరాలు గుర్తించేవిధంగా ఒక మొబైల్ యాప్‌లో నమోదు చేయబడి ఉంటాయన్నారు.

ల్యాండ్ బ్యాంక్ కొరకు భూమిని గుర్తించాలి

ల్యాండ్‌బ్యాంక్ కొరకు రెవెన్యూఅధికారులు ఖాళీ భూమిని గుర్తించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలపై డివిజన్, మండలస్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆయన వీక్షణా సమావేశం నిర్వహించారు. 13 అంశాలపై అధికారులతో సమీక్షించారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబిత తయారికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 5,375 దరఖాస్తులను పరిశీలించాలన్నారు. నీటిసంఘాల ఎన్నికలు డిసెంబరు 8, 11, 14 తేదిలలో నిర్వహించాలన్నారు.

ధాన్యం సేకరణ వారంరోజుల్లో ప్రారంభించాలి : జాయింట్ కలెక్టర్

ధాన్యం సేకరణ వారం రోజుల్లో అధికారులు ప్రారంభించాలని జేసీ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. ప్రతి మండలంలో గ్రామసభలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. రైతుల ఆమోదంతోనే రైస్‌మిల్లులను ట్యాగ్ చేయాలన్నారు. ఓపెన్ మార్కెట్‌లో ధాన్యాన్ని రైతులు అమ్ముకున్నప్పటికి వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. శాసనమండలి ఎన్నికలకు ఓటర్ల జాబిత సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, పౌరసరఫరాల జిల్లా అధికారి ఈటి విలియమ్స్, తహసీల్దార్, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఎస్టీల కోసం శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన గిరిజనులు వినతిపత్రం ద్వారా కలెక్టర్‌కు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఇంటిస్థలం లేని ప్రతి ఎస్టీకుటుంబానికి నివేశన స్థలం అందించటానికి అధికారులు సర్వేప్రక్రియ ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆధార్ కార్డుల సర్వే పూర్తి చేయాలని పట్టాలిచ్చేలా భూమిని గుర్తించాలని చెప్పారు. ఆయా కాలనీలలో ప్రభుత్వభూములు ఖాళీగా ఉంటే ఎస్టీలకు కేటాయించాలన్నారు. ఎస్టీకుటుంబాలను మండలప్రత్యేకాధికారులు దత్తతు తీసుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వారికి వర్తింప చేయాలన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం, జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో చర్చించిన అంశాలన్నిటిని పరిష్కరించాలన్నారు. ఎస్టీల శ్మశానభూమి పరిరక్షించాలని అధికారులకు తెలిపారు. స్వావర్షుపురంలో ఎస్టీలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. వెదుళ్ళపల్లిలోని ఎస్టీహాస్టల్ భవన్‌లో మార్కెట్ కొనసాగుతున్నందున అద్దె సొమ్ము గిరిజన సంక్షేమశాఖ కార్యాలయానికి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూఅధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ సిబ్బందితో వాగ్వివాదం చేస్తున్న హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు

మార్కెట్ బయట విక్రయాలు.. అడ్డుకున్న మున్సిపల్ అధికారులు

● అధికారులు, వ్యాపారుల మధ్య వాగ్వాదం

బాపట్ల,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్ దగ్గర శుక్రవారం ఉదయం మున్సిపల్ అధికారులు, హోల్‌సేల్ వ్యాపారుల మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదం చోటు చేసుకుంది. కూరగాయల మార్కెట్‌లో కావాల్సినన్ని దుకాణాలు ఉన్నప్పటికి కొంతమంది వ్యాపారులు మార్కెట్‌బయట రోడ్డు పక్కనే కూరగాయలు గుట్టలుగా పోసి విక్రయించటాన్ని అధికారులు కొద్దిరోజులుగా అడ్డుకుంటున్నారు. బయట వ్యాపారం చేయటం వల్ల లోపల దుకాణాలలో కూరగాయలు విక్రయించేవారికి వ్యాపారం సరిగ్గాలేక నష్టపోతున్నారని దీనివల్ల అనేక మంది దుకాణాలు ఖాళీ చేసినట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు మాత్రం ప్రతి రోజు లారీలలో వచ్చే కూరగాయలు బయట దింపుకొని 7గంటలు వరకు వ్యాపారం చేసుకుంటామని చెప్పారు. ఈవిధంగా చేయటం వల్ల కొనుగోలు దారులు బయట కొనుక్కోని వెళ్ళిపోతున్నారని లోపల అద్దెలు కట్టి దుకాణాలు నిర్వహించుకునే వారికి వ్యాపారం జరగటంలేదని మున్సిపల్ అధికారులు తెలియజేశారు. అయినప్పటికి ఒప్పుకోకపోవటంతో మున్సిపల్ అధికారులు ట్రాక్టర్ తీసుకొచ్చి మార్కెట్ బయట పోసిన కూరగాయలను తీసుకెళ్ళే ప్రయత్నం చేశారు. దీనిని హోల్‌సేల్ వ్యాపారులు అడ్డుకొని మున్సిపల్ అధికారులతో వాగ్వాదం చేశారు. చివరకు కొందరు సర్ది చెప్పటంతో శాంతించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డిని వివరణ కోరగా రైతులు ఆరుబయట కూరగాయలు విక్రయిస్తుంటే వ్యాపారం జరగటంలేదని మార్కెట్‌లోని వ్యాపారులు చెప్పటంతో వారందరిని రైతు బజారులోకి పంపించటం జరిగిందన్నారు. మరలా హోల్‌సేల్ వ్యాపారులు మార్కెట్‌బయట విక్రయించటం వల్ల సమస్య తలెత్తుతుందన్నారు.. దీనిపై అవసరమైతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మరియరాణి కాలనీ శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలి

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 8వ సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో వెంగల్ విహార్, పటేల్‌నగర్, మరియరాణి ప్రాంతాలలో కమిషనర్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరియరాణి కాలనీకి శ్మశాన వాటిక సమస్య ఉందని చెప్పారు. సమస్యను ఎమ్మెల్యే నరేంద్రవర్మ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేవిధంగా చూస్తానని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ డి.ప్రసాద్, రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, శానిటరి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కరుణ, మెప్మా సీఎంఎం ఎస్.సుబ్రహ్మణ్యం, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాన్ని తొలిగించొద్దు : దళిత సంఘాలు

బాపట్ల,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కలెక్టరేట్, జిల్లాపోలీసు కార్యాలయం, ఇతర జిల్లా కార్యాలయాలకు వెళ్ళేందుకు సౌకర్యవంతమైన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈటిసి ఎదురుగా ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని పక్కకు జరపాలనే ఆలోచన చేశారు. దీంతో అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక దళిత సంఘాల నాయకులతో కలెక్టర్ జె.వెంకటమురళిని కలిసి విగ్రహం తొలిగించవద్దు అంటూ వినతిపత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ ఆప్రాంతాన్ని పరిశీలించి అందరికి ఆమోదయోగ్యమైతేనే తొలిగిస్తామని లేకుంటే విగ్రహం అదేప్రాంతంలో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ గుదే రాజారావు, విసికే పార్టీ జిల్లా అధ్యక్షులు రేగుల గడ్డ చంద్రశేఖర్, కాగిత రవిబాబు తదితరులు ఉన్నారు.

సమస్యాత్మక భూముల యాజమాన్యంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఉప్పునీటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మధువాణి

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమస్యాత్మక భూముల యాజమాన్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని బాపట్ల ఉప్పు నీటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మధువాణి తెలిపారు. మండలంలోని మర్రిపూడి గ్రామంలో శుక్రవారం బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఆర్‌కెవివై-రాస్తార్ 2024-2025 సౌజన్యంతో వివిధ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా డాక్టర్ మధువాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వివిధ పంటలలో సమగ్ర ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. జిల్లా వ్యవసాయ శిక్షణా సమన్వయకర్త ఎం.విజయనిర్మల మాట్లాడుతూ రబీలో సాగు చేసే పంటలను, రైతులందరు భూమిపై నాటిన ప్రతి పంటను ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించాలన్నారు. బాపట్ల ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ మురళీధర్‌నాయక్ వరి మాగాణులలో సాగు చేయబోయే మినుము పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. క్రాప్ ఇన్సూరెన్స్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు ఆవశ్యకత గురించి వ్యవసాయాధికారి చంద్రశేఖర్ వివరించారు. అనంతరం వరిపొలాల క్షేత్ర సందర్శన చేశారు. వరిలో అగ్గితెగులు, ఆకుముడత ఉన్నట్లు గమనించారు. నివారణ చర్యలు గురించి రైతులకు తెలియజేశారు.

ప్రముఖ క్షేత్రంగా శ్రీతారకేశ్వరస్వామి దేవాలయం విరాజిల్లుతోంది

● శ్రీ విధుశేఖరభారతీ మహాస్వామి


మాట్లాడుతున్న శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి

బాపట్లరూరల్,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో సూర్యలంక తీరంలోని శ్రీతారకేశ్వరస్వామి దేవాలయం ప్రముఖ పుణ్య క్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శార దాపీఠం శ్రీ విధుశేఖరభారతీ మహాస్వామి అన్నారు. బాపట్ల మండలం సూర్యలంక తీరంలోని శ్రీతారకేశ్వరస్వామి దేవాలయానికి శుక్రవారం ఆయన విచ్చేశారు. ముందుగా ముత్తాయపాలెం గ్రామసమీపంలోని రహదారి వెంట ఉన్న శ్రీఆంజనేయస్వామి విగ్రహానికి స్వామిజీ ప్రత్యేక పూజలను నిర్వహించారు. అక్కడ నుంచి నేరుగా శ్రీతారకేశ్వరస్వామి దేవాలయానికి చేరుకొని స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి విశేష పూజలను వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో స్వామిజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఈ దేవాలయానికి అధిక సంఖ్యలో భక్తులు రావటం జరుగుతుందని, పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి ఎంతగానో కృషి చేసిన మంతెన దశరథ మహరాజుకు ఆశీస్సులను అందజేశారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దత్తత తీసుకోవాలి : డీసీపీవో

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దత్తత కావాల్సిన తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మాత్రమే తీసుకోవాలని డీపీవో పురుషోత్తమరావు అన్నారు. శుక్రవారం బాపట్ల జిల్లా మైరా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాపట్ల విశ్వబ్రహ్మణి కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దత్తత అవగాహన మాసోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ దత్తత ఇవ్వటం, తీసుకోవటం చట్టరీత్యా నేరమని, అలా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, మెడికల్ ఆఫీసర్లు త్రివేణి, డాక్టర్ గోపి, బాలల సంరక్షణాధికారి కృష్ణ, శిశు గృహ మేనేజర్ రోజిలీనా పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసంపై అవగాహన

పిట్టలవానిపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో జరుగుతున్న రుగ్మతలపై కిశోర బాలికలు అవగాహన కలిగి ఉండాలని చందోలు అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.అరుణకుమారి అన్నారు. మండలంలోని చందోలు నీలిబంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికల వికాసంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్రొటెక్షన్ అధికారి శ్రీప్రియ మాట్లాడుతూ బాల్యవివాహాలు జరుగుతుంటే 1098 అనే హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ మౌనిక, సిడబ్ల్యూ సుకన్యకుమారి, మహిళా పోలీసులు శివమ్మ, లక్ష్మీశిరీషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ అతహార్, పాఠశాల విద్యార్థినులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

డిసెంబరు 7న తల్లిదండ్రులు, టీచర్లతో సమావేశం

కర్లపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలు, అవసరాలపై మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో డిసెంబరు 7న సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాపరిషత్ హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులతో శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల విద్యకు సంబంధించి లోటుపాట్ల ను తల్లిదండ్రుల సమక్షంలో సరిచేయటం, తల్లిదండ్రులకు రంగోలి, ఖగాస్‌వార్ పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పించాలి : సీఐటీయూ

బాపట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు వలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పించి వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్ డిమాండ్ చేశారు. ఈవిషయమై శుక్రవారం వలంటీర్లతో కలిసి బాపట్ల పాతబస్టాండ్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి తహసీల్దార్ షేక్.సలీమాకు వినతిపత్రం అందజేశారు. వలంటీర్స్ యూనియన్ నాయకులు కోటేశ్వరి, అనూష, ఎస్‌కె షకీరా, సీఐటీయూ జిల్లానాయకులు కె.శరత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల నిర్వహణపై ప్రత్యేక నిఘా : సీఐ

వేమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల నిర్వహణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సిఐ రవి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 17 బెల్ట్‌షాపులపై దాడి జరిపి 18 మంది ముద్దాయిలను అరెస్టు చేసి కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి 209 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని 15 మందిపై బైండోవర్ కేసులు బనాయించినట్లు వివరించారు.

మరుగుదొడ్లను వినియోగించాలి : ఎంపీడీవో

కర్లపాలెం,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆరు బయట మల విసర్జన ఆపి వేసి మరుగుదొడ్లను వినియోగిస్తే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం ఎం.వీరాజుపాలెం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మరుగుదొడ్ల వినియోగం, విద్యార్థులకు అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పిట్టు విజయభాస్కరరెడ్డి, గ్రామసర్పంచ్ నక్కా లలితకుమారి, డీటీ శ్రీదేవి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి సునీత, వీఆర్వో అమానుల్లా, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మీర్ బేగ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఎం.వి.రాజుపాలెం హైస్కూల్ ఆపార కేంద్రంను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసరావు, శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయభాస్కరరెడ్డి, సర్పంచ్ నక్కా లలితకుమారి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు అమ్‌బేగ్, వీఆర్ అమానుల్లా, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

వాహన తనిఖీలలో ఐదు కేసులు నమోదు

కర్లపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెం సమీపంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వాహన తనిఖీలలో 5 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.30 వేల అపరాధ రుసుం విధించామని బాపట్ల మోటారు వాహన తనిఖీ అధికారి భాను వెంకటరంగారావు తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో వెంకటేశ్వరరావు

కొల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు గురించి రైతులకు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల పరిధిలోని చిలుమూరులో యంత్రం ద్వారా వరి పంటను కోత కోయగా వచ్చిన ధాన్యాన్ని ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనలు మేరకు ధాన్యం వాహనంలో లోడింగ్ చేసిన దగ్గర నుండి రైస్‌మిల్లు వద్ద అన్‌లోడింగ్ జరిగే వరకు జీపీఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేయబడుతుందన్నారు. వాహన యజమానులు తమ వాహనానికి జీపీఎస్ పరికరాన్ని అమర్చుకున్న తరువాతే ధాన్యం రవాణా చేయాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఏవో సూచించారు.

డిపో అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్

రేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డిపో అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని రేపల్లె డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. డిపో మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం డిపో అన్నివిధాలా అభివృద్ధికి కార్మికులు, నాయకులు పని చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బ్రహ్మయ్య, సెక్రటరీ డి.చిట్టిబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు, సభ్యులు ఆకురాతి రంగనాథ్‌లను అభినందించారు.

యూటీఎఫ్ కార్యాలయానికి వితరణ

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ కార్యాలయానికి విశ్రాంత ఉపాధ్యాయులు తమవంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయానికి విశ్రాంత ఉపాధ్యాయుడు కొడాలి లక్ష్మీకాంతారావు రూ.6 వేలు విలువ కలిగిన డబుల్ డెస్క్ టేబుల్‌ను అందజేశారు. మరో విశ్రాంత ఉపాధ్యాయుడు కూచిమంచి శివరామకృష్ణ కార్యాలయంలో కంప్యూటర్ కొనుగోలు నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇరువురిని తాజాగా ఎన్నికైన మండల అధ్యక్ష, కార్యదర్శులు, గౌరవాధ్యక్షులు అల్తాఫ్ హుస్సేన్, వి.సురేష్‌కుమార్, ఎం.శ్రీనివాసరావులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు.

26న క్విజ్ పోటీలు

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ స్థాయి క్విజ్ పోటీలు ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఏపీ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవాలను పురస్కరించుకుని నిజాంపట్నం మండలంలోని చింకపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26న క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొన్నాలన్నారు. భారత రాజ్యాంగం అనే అంశాల మీద క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 9493442748, 9989508915లో సంప్రదించాలని కోరారు.

మండలంలో జాతీయ జన దివస్

వేమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బిర్సా ముండా జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని చావలి, వేమూరు గ్రామాలలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ జన దివస్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి మండల విద్యాశాఖ అధికారి రోజ్‌ల్యాండ్ మాట్లాడుతూ, బిర్సాముండా చరిత్రను విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు, గిరిజన తెగకు సంబంధించిన నాట్యప్రదర్శన నిర్వహించి ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శించారు. ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వేమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుండి 11 కెవి వేమూరు ఫీడర్ మీద శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మతులు చేపట్టనున్నట్లు ట్రాన్స్ ఏఈ గోపి తెలిపారు. వేమూరు, జంపని గ్రామాల్లో ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

కల్యాణ మండపానికి విరాళం

చుండూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెదగాదెలవర్రులో శ్రీపెద్దింటమ్మ దేవాలయ కల్యాణ మండప నిర్మాణానికి వేటపాలేనికి చెందిన కంఠంనేని రాఘవయ్య, తులశమ్మ కు టుంబీకులు రూ.లక్ష విరాళం అందించినట్లు ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.



ఊతమిస్తే.. ఉపాధి



మహిళల ఆర్థిక స్వాలంబనకు ఒకప్పుడు దిక్సూచిగా నిలిచిన కేంద్రమది. ఎన్నో శిక్షణా తరగతులు నిర్వహించి మహిళల స్వయంఉపాధికి బాటలు వేసిన కేంద్రం అది. అంతేకాదు అక్కడ ప్రింటింగ్, బైడింగ్, మసాల కారం, కేకులు, బనియన్లు తయారీ యూనిట్‌లను మహిళలు ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. అటువంటి ప్రతిష్టాత్మకమైన నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళాసాధికారత కేంద్రం (తెలుగు బాల మహిళా ప్రాంగణం) నేడు దాని ప్రాధాన్యాన్ని కోల్పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఊతమిస్తే తెలుగు బాల మహిళా ప్రాంగణం పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని ఔత్సాహిక మహిళలు ఎదురుచూస్తున్నారు.

- పతనావస్థలో ఉపాధి శిక్షణా కేంద్రాలు
- స్వయం ప్రతిపత్తి దశ నుంచి క్షీణ స్థితికి
- నాడు లక్షల్లో టర్నోవర్.. నేడు జీతాల కోసం వెతుకులాట
- కమీషన్ల కోసం కక్కుర్తి, సిండికేట్ జోక్యంతో పతనం
- దశాబ్ద కాలంగా ప్రధాన ఉత్పత్తి యూనిట్లన్నీ మూత
- తుప్పుపట్టిపోతున్న యంత్రాలు, సామగ్రి
- మహిళా ప్రాంగణానికి నాటి వైభవం వచ్చేనా?

గుంటూరు(విద్య),నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు తొలిసారి ముఖ్యమంత్రి అయిన అనంతరం 1983లో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు బాల మహిళా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఆ క్రమంలోనే గుంటూరు కలెక్టరు బంగ్లా సమీపంలో తెలుగు బాల మహిళా ప్రాంగణం ఏర్పాటు అయింది.



ప్రారంభంలో కేవలం స్వయం ఉపాధి శిక్షణలకే పరిమితమైన ఈ కేంద్రంలో తర్వాత అనేక స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటయ్యాయి. తొలుత ప్రింటింగ్, బైండింగ్ యూనిట్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీ, ప్రభుత్వ ప్రచారం కోసం ఉపయోగించే కరపత్రాలు, మల్టీకలర్ పోస్టర్స్ వంటివి ఇక్కడ ముద్రించి అందించే వారు. ప్రభుత్వ సంస్థల నుంచి వచ్చే అనేక ప్రింటింగ్ సామగ్రి ఈ కేంద్రానికే వచ్చేవి ఫలితంగా ఆర్థిక పరిపుష్టి సాధించడంతో కొత్త యూనిట్లు ఏర్పాటయ్యాయి. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో బనియన్ల తయారీ, కేక్స్ యూనిట్, మసాల కారం, చెప్పులు, సబ్బులు తయారుచేసే యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేశారు.

మహిళా ప్రాంగణం బ్రాండ్‌తో ఆయా ఉత్పత్తులను విక్రయించే వారు. రాష్ట్రంలో అనేక ప్రదర్శన శాలల్లో మహిళా ప్రాంగణం ఉత్పత్తులను ప్రదర్శించేవారు. ఇలా మంచి ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ ప్రాంగణం స్వయం ప్రతిపత్తి సాధించే కీలక దశకు కూడా వచ్చింది.

మరోవైపు జడ్పీ నుంచి సెస్‌రూపంలో కొంత మొత్తం నిధులను మహిళా ప్రాంగణాలకు విడుదల చేసే వారు. ఈ నిధులతో కంప్యూటర్ శిక్షణ, ఫ్యాబ్రిక్ పెయిటింగ్, బ్యూటీషియన్, కుట్టుశిక్షణ వంటి స్వయం ఉపాధి శిక్షణలు క్రమం తప్పకుండా నిర్వహించారు. దీంతో వేలాది మంది స్వయం ఉపాధికి ఈ ప్రాంగణం బాటలు వేసింది. అంతేకాదు ఔత్సాహిక మహిళల్ని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి బిజినెస్ కౌన్సిలింగ్ కేంద్రాన్ని కూడా మహిళా ప్రాంగణంలో ఇక్కడ ఏర్పాటు చేశారు.

ఉత్పత్తి కేంద్రాల పతనం ఇలా...

మహిళా ప్రాంగణంలో అనేక యూనిట్లులో పనిచేస్తున్న కీలకమైన వ్యక్తులు ప్రాంగణంలో అప్పట్లో విధులు నిర్వర్తించిన మేనేజర్లు కమీషన్లకు కక్కుర్తిపడి ఇక్కడకి వచ్చిన ప్రింటింగ్ ఆర్డర్స్ సకాలంలో పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రైవేటు ప్రెస్‌లకు తరలించేలా సిండికేట్ నడిపించారు. అంతేకాదు లక్షల విలువైన స్టేషనరీ పంపిణీ కూడా క్రమంగా ప్రైవేటు వ్యక్తుల పరమైంది. ప్రాంగణంలో ఉన్న కేక్‌యూనిట్, మసాలా కారం తయారీ యూనిట్లును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఆ తర్వాత మార్కెటింగ్ నిర్వహణా లోపం కారణంగా బనియన్ల తయారీ, చెప్పుల యూనిట్ మూతపడింది. దీనికితోడు గత వైసీపీ ప్రభుత్వ హయంలో మహిళా ప్రాంగణం మరింత దీన స్థితికి చేరింది. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలోని అనేక యూనిట్ల యంత్రాలు, సామగ్రి తుప్పుపట్టిపోతున్నాయి. ప్రభుత్వం, స్థానిక సంస్థల నుంచి నిధులు నిలిచిపోవడంతో సిబ్బంది జీతాలకే వెదుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర మహిళ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ కావలి గ్రీష్మ ప్రాంగణాలకు పూర్వ వైభం తీసుకువస్తామని ప్రకటించారు. ఈనేపథ్యంలో అక్కడ ఉత్పత్తి కేంద్రాలకు పూర్వవైభవం వస్తుందని ఔత్సాహిక మహిళలు ఎదురు చూస్తున్నారు.



శిక్షణ లేక గోదాముకు చేరిన కుట్టుమిషన్లు



షెడ్డులో దుమ్ముపట్టి పోతున్న ప్రిటింగ్ యూనిట్



రాష్ట్రంలోని రోడ్లకు రెండేళ్లలో కొత్తరూపు

- గత ప్రభుత్వంలో ఎన్‌డీబీ నిధులు పక్కదారి
- అధ్వాన రహదార్లతో రాష్ట్ర ప్రగతికి విఘాతం
- సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లు
- ఆర్ అండ్ బీ శాఖా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి
- మంగళగిరిలో ఎన్‌డీబీ రహదారుల పనులు పున:ప్రారంభం



అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

మంగళగిరి సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని మొత్తం రోడ్లన్నీ పూర్తిగా కొత్తరూపు సంతరించుకుంటాయని ఏపీ రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన మంగళగిరి-నిడమర్రు ఎన్‌డీబీ రోడ్డు పనులను శుక్రవారం మంత్రి పునః ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు.

ఈసందర్భంగా మంత్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సహచర మంత్రి నారా లోకేశ్ సొంత నియోజకవర్గంలో ఎన్‌డీబీ రోడ్ల పనులను తిరిగి ప్రారంభించడం సంతోషంగా వుందన్నారు. గత ప్రభుత్వం ఎన్‌డీబీ రోడ్లకు సంబంధించిన నిధులను పక్కదారి పట్టించడంతో రోడ్ల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని స్పష్టం చేశారు. అధ్వాన రహదార్లతో రాష్ట్రం నుంచి పరిశ్రమలు వెళ్లిపోయాయని, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందలేకపోవడానికి అధ్వాన్న రోడ్లే కారణమని పేర్కొన్నారు. సంక్రాంతి నాటికి గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా ప్రభుత్వం రూ.861 కోట్లతో ఇప్పటికే పనులను కూడా ప్రారంభించిందని తెలిపారు. తానే స్వయంగా కాంట్రాక్టర్లతో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో తిరిగి పనులు చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. జిల్లాలో రూ.120 కోట్లతోను, మంగళగిరి నియోజకవర్గంలో రూ.51.06 కోట్లతోను పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రజలకు అసౌకర్యం లేని రహదారులే లక్ష్యంగా పీపీపీ పద్ధతిలో కొత్త రహదార్ల ఏర్పాటుకు కొన్ని జిల్లాలను ఎంపిక చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం మంత్రి జనార్ధన్‌రెడ్డి నిడమర్రు గ్రామంలో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మంగళగిరి-పరిమి రోడ్డును విస్తరించాలని గ్రామస్తులు కోరడంతో సానుకూలంగా స్పందించారు.

ఈకార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ నయీముల్లా, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కుర్రా బ్రహ్మం, నేతలు ఉయ్యూరు సాంబిరెడ్డి, గాదె లక్ష్మారెడ్డి, బూదాటి ఏడుకొండలు, కొమ్మారెడ్డి శ్రీనివాసులురెడ్డి, కంఠం వెంకటరెడ్డి, కుర్రా పుల్లయ్య బొల్లా రంగారెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు.. నిధులు

(5వ పేజీ తరువాయి..)

నిధులు విడుదల చేసింది. అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణాల్లోనే ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నిమ్మ, నారింజ, బొప్పాయి, అరటి వంటి పండ్ల మొక్కలతో పాటు తోటకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి కూరల మొక్కలు పెంచి వాటితోనే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం సూచించింది.

- గుంటూరు జిల్లా: 152 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.54.72 లక్షలు, 188 కేంద్రాల్లో మంచినీటి సదుపాయానికి రూ.32 లక్షలు, పోషణ వాటిక, వర్షపు నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన కింద 204 కేంద్రాలకు రూ.93.43 లక్షలు కేటాయించింది.
- బాపట్ల జిల్లా: 190 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.68.40 లక్షలు, 258 కేంద్రాల్లో మంచినీటి సదుపాయాలకు రూ.43.86 లక్షలు, 261 కేంద్రాల్లో పోషణ వాటికలు, వర్షపు నీటి నిర్వహణకు కోటీ 19 లక్షల 8 వేలు కేటాయించింది.
- పల్నాడు జిల్లా: 243 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.87.48 లక్షలు, 369 కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలకు రూ.62.73 లక్షలు, 67 కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పోషణ వాటికల ఏర్పాటు, వర్షపునీటి యాజమాన్యం నిర్వహణకు రూ.30.68 లక్షలు కేటాయించింది.

ఆధునిక వైద్య విధానంపై అవగాహన అవసరం

- జీఎంసీ ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుందరాచారీ వెల్లడి
- గుంటూరులో ప్రారంభమైన ఐఎంఏ రాష్ట్ర సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సూపరింటెండెంట్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిలో రాణించేందుకు, ఆధునిక వైద్య రంగంలో వస్తున్న నూతన చికిత్సా విధానాలను ఎప్పటికప్పుడు వైద్యులు తెలుసుకోవాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ ఉద్బోధించారు. శుక్రవారం వైద్యకళాశాల జింకానా ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) 66వరాష్ట్ర వార్షికసదస్సు 'ఏపీకాన్ 2024' ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభకు సదస్సు సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ సీహెచ్ విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ సుందరాచారీ, ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. 16 ఏళ్ల తర్వాత ఐఎంఏ రాష్ట్ర సదస్సు గుంటూరులో నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ సుందరాచారీ తెలిపారు. వైద్యరంగంలో ఇప్పుడు పరిశోధన అవకాశాలు పెరిగాయన్నారు. యువ వైద్యులు వ్యాధుల నిర్ధారణ, చికిత్స విధానాలు, పరిశోధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానాల ద్వారా సమర్థ వంతమైన చికిత్సలు రోగులకు లభిస్తున్నాయని, వాటి గురించి తెలుసుకొనేందుకు ఐఎంఏ రాష్ట్రస్థాయి సీఎంఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగడపతాయన్నారు.

సీఎంఈలకు హాజరు తప్పనిసరి..

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ ఎం ఫణీకుమార్ మాట్లాడుతూ వైద్యులకు సంవత్సరానికి ఆరు చొప్పున ఐదేళ్లల్లో 30 సీఎంఈ క్రెడిట్ అవర్స్ ఉంటేనేవారి డిగ్రీ మెడికల్ కౌన్సిల్ రీరిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు. సభలో ఐఎంఏ రాష్ట్రశాఖ నూతన అధ్యక్షుడుగా డాక్టర్ గార్లపాటి నందకిషోర్, రాష్ట్ర కారయదర్శి డాక్టర్ పీ ఫణిధర్, సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ డాక్టర్ టీ. సేవకుమార్, గుంటూరుశాఖ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ వై.సుబ్బారాయుడు, డాక్టర్ బీ.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సైంటిఫిక్ సెషన్ జరిగింది. జింకానా ప్రధాన ఆడిటోరియంలో సైంటిఫిక్ సెషన్‌లో పలువురు వైద్యులు ప్రసంగించారు. మెడికల్‌పీజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు. శని, ఆదివారాల్లో కూడా సదస్సు జరుగుతుంది.



బావాజీపాలెం ఏరియల్ వ్యూ

బావాజీపాలెం సైనికులు





దేశం కోసం పనిచేయడం సైనికులు గర్వంగా భావిస్తారు. దేశరక్షణలో ముందుంటూ సరిహద్దుల్లో బాధ్యతగా పనిచేస్తూ ఉంటారు. మరి, అటువంటి సైనికులను ఒకరిని కాదు ఇద్దరిని కాదు.. ఏకంగా వందల సంఖ్యలో దేశానికి అందిస్తున్న ఘనత బావూజీపాలెం గ్రామానిది. మూడు నాలుగు తరాలుగా ఈ గ్రామం నుంచి సైన్యంలో పని చేసిన వారు, ప్రస్తుతం చేస్తున్నవారు ఉన్నారు. ఇప్పటికీ ఈ గ్రామం నుంచి 200 మంది సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో సేవలంది స్తున్నారు. సైన్యంలో చేరేందుకు 'సై' అంటున్న సైనికుల గ్రామం బావాజీపాలెం గురించిన విశేషాలు..

రేపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని నిజాంపట్నం మండలం బావాజీపాలెం గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పనిచేస్తుంటారు. సైన్యంలో పని చేయడమంటే ఎంతో బాధ్యతగా భావిస్తారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు వందల సంఖ్యల్లో ఇక్కడ నుంచి ఆర్మీలో పని చేసిన వారున్నారు. నేటికీ అదే స్ఫూర్తితో 200 మందికి పైగానే ఇంటికి ఇద్దరు చొప్పున ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. మైనర్ పంచాయతీ బావాజీపాలెంలో 550 కుటుంబాలు ఉండగా 2,400 మంది జనాబా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సరిహద్దులో విధులు నిర్వహించి ఇప్పటికే 400మంది ఉద్యోగ విరమణ చేశారు. ఇప్పటికీ 200 మంది సరిహద్దుల్లో పలుప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారు.


- ఇంటికి ఇద్దరు, ముగ్గురు జవాన్లు
- 1980లోనే ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ
- సరిహద్దుల్లో పనిచేయడం గర్వకారణమంటున్న సైనికులు

1980లో గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆర్మీ

ఈగ్రామంలో అత్యధికంగా సైనికులు ఉన్నారని గుర్తించిన ఆర్మీ మద్రాస్ స్పాన్సర్ ఉన్నతాధికారులు 1980లో దీనిని దత్తత తీసుకుని మంచినీటి పథకం నిర్మించారు. అప్పట్లోనే గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు ఆర్మీలో చేసే వారి కోసం ప్రత్యేక బ్యాంకును ఏర్పాటు చేశారు. ఈ గ్రామం నుంచి ఎవరైనా ఆర్మీలో చేరేందుకు వెళితే వెంటనే వారికి అనుమతులు మంజూరు చేస్తారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో..

ఈ గ్రామానికి చెందిన అబ్దుల్ అజీమ్, అబ్దుల్ హమీమ్‌లు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నారు. మహ్మద్ యాకబ్, అబ్దుల్ అజీద్, అహ్మద్ రఫీ, రియాజ్ బాషా, మహ్మద్ షారూక్ సైన్యంలో సేవలు అందిస్తూ పలు ప్రమాదాల్లో మృతి చెందారు. వీరిలో కొందరు కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు.



ఆర్మీ దత్తత తీసుకుని నిర్మించిన ఓవర్‌హెడ్‌ట్యాంక్

అబ్బాయి పుడితే ఆర్మీకే

గ్రామంలో ఎవరి కుటుంబంలోనైనా అబ్బాయి పుడితే ఆర్మీకే పంపుతారు. తండ్రులు ఆర్మీలో చేరడం వారి తనయులను పంపటం ఆనవాయితీగా వస్తోంది. తండ్రులు, తనయులు, ఇంటి అల్లుళ్ళతో కలిసి ఒకే ఇంట్లో ముగ్గురు,నలుగురు చొప్పున సైనికులు కూడా ఉన్నారు. కాశ్మీర్,రాజస్థాన్, చైనా బోర్డరులో విధులు నిర్వహిస్తూ దేశానికే గర్వకారణంగా బావూజీపాలెం నిలుస్తుంది.

అమ్మాయి పుడితే సైనికుడితోనే పెళ్ళి

మిలటరీ కుటుంబాల్లో అమ్మాయి పుడితే సైన్యంలో పనిచేసే వ్యక్తికే ఇచ్చి వివాహం జరిపిస్తారు.ఆర్మీలో చేసే వ్యక్తినే ఆ ఊరి ఆడపిల్ల మనువాడటానికి మక్కువ చూపుతుంది. ఇప్పటికే సుమారు 100 మందికి పైగా ఆఊరి ఆడపిల్లలు సైన్యంలో పని చేసే వారినే పెళ్లిళ్లు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు.

శ్రీలంక, కార్గిల్ యుద్ధాల్లో సేవలు

- అమానుల్లాఖాన్,మాజీ సైనికుడు



దేశసరిహద్దుల్లో వివిధ ప్రాంతాల్లో 30 ఏళ్ళ పాటు పని చేసి సుబేదారుగా ఉద్యోగ విరమణ చేశా. అప్పట్లో ఎలాంటి సమాచార వ్యవస్థ ఉండేది కాదు. కుటుంబ సభ్యులు యోగక్షేమాలు తెలిసేవికాదు. యుద్ధ సమయాల్లో కుటుంబసభ్యులు గుర్తుకు వచ్చినా 'దేశం తర్వాతే కుటుంబం' అనే నినాదంతో పనిచేశాం. నా తండ్రి ఆర్మీలోనే పనిచేశారు. నా కుమారుడిని ఆర్మీలోకి పంపాను. సైన్యంలో పనిచేసే వ్యక్తితోనే నా కుమార్తెకు వివాహం జరిపించాను.

నేనూ తమ్ముడు సైన్యంలోనే..

- సిరాజుద్దీన్ బాబు,సైనికుడు.



మా తాత, నాన్న ఆర్మీ లోనే పని చేశారు. నేనూ, నాతమ్ముడు కూడా సైన్యంలోనే పనిచేస్తున్నాం. మా అక్కను ఆర్మీలో పనిచేసే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశాం. మా గ్రామానికి సైనికుల గ్రామంగా గుర్తింపు ఉంది. ఆ మాటలు వింటే గర్వంగా ఉంటుంది. మాజీ సైనికుడే ప్రస్తుతం మా గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నాలుగు తరాలు మిలటరీలోనే విధులు

- మస్తాన్‌వలీ, మాజీ సైనికుడు



దేశ రక్షణ కోసం మా కుటుంబం నుంచి నాలుగు తరాలుగా సైన్యంలో పనిచేస్తున్నాం. మంచుకొండలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించాం. 1965లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నేను 1987లో ఉద్యోగ విరమణ చేశాను. జమ్మూకాశ్మీర్, మిజోరాం, అబీఘర్, శ్రీగంగానగర్‌లో పంజాబ్‌లో విధులు నిర్వహించాను. మా తాత మహ్మద్ అనీఫ్ మిలటరీ విధులు నిర్వహించారు. యుద్ధంలో మృతి చెందారు. మా తండ్రి అహ్మద్ ఇబ్రహీం ముప్పై ఏళ్ల పాటు దేశరక్షణకు సేవలు అందించారు. నా ముగ్గురు కుమారులు ఆర్మీలోనే పనిచేస్తున్నారు. ఇద్దరు అమ్మాయిలను కూడా ఆర్మీలో పనిచేసేవారికి ఇచ్చి పెళ్లిళ్లు చేశాను. దేశ వ్యాప్తంగా మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపు ఉండటం గర్వపడే విషయం.



రేణుకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో లలిత సహస్రనామం, విష్ణు సహస్ర నామం జపిస్తున్న మహిళా భక్త భజనబృందం (ఇన్‌సెట్లో) అమ్మవారు

రేణుకమ్మ ఆలయ ప్రాంగణంలో వనభోజన మహోత్సవం

పంగులూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామంలోని రేణుకమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కార్తీక మాస వనభోజన మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిట్టాబత్తిన వంశ దేవర రేణుకమ్మ తల్లి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంగులూరు, చందలూరు, ద్రోణాదుల గ్రామాలకు చెందిన భజన బృందాలు లలిత, విష్ణు సహస్రనామం పఠిస్తూ భజన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప, శివ దీక్షధారణ చేసిన వందలాది మంది స్వాములతో పాటు గ్రామ ప్రజలకు భారీగా భోజన ఏర్పాట్లు చేశారు. చిట్టాబత్తిన వంశస్థులు, గ్రామస్థుల సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



డిబేట్‌లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి బాలికల హైస్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న అధికారులు

జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన అద్దంకి మండల విద్యార్థినులు

డిబేట్‌లో ప్రథమ స్థానం, వక్తృత్వంలో తృతీయస్థానం

అద్దంకిటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బాపట్లలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అద్దంకి మండలం విద్యార్థులు సత్తాచాటారు. డిబెట్‌లో అద్దంకిలోని శ్రీప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు లక్ష్మీదేవి, సాయి సమీరాలు జిల్లా పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచారు. మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అద్దంకి అమృత వక్తృత్వం పోటీలలో జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపి అద్దంకి మండలం, పాఠశాలలకు పేరు తెచ్చిన విద్యార్థినులను ఎంఈవోలు గంగాధరరావు, సుధాకర రావు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.



అవధూత సన్నిధిలో హాస్యనటుడు కృష్ణభగవాన్

అవధూత స్వామి కోసమే చీరాలకు వచ్చా

- నటుడు కృష్ణ భగవాన్

చీరాలటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో వేంచేసియున్న శ్రీ అవధూత స్వామిని దర్శించుకోవడానికే చీరాలకు వచ్చానని సినీ హాస్యనటుడు కృష్ణ భగవాన్ అన్నారు. పట్టణంలోని శ్రీ అవధూత స్వామి ఆశ్రమాన్ని శుక్రవారం కృష్ణభగవాన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి సేవల గురించి పలువురు ప్రముఖులు చెబుతుంటే విన్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే ప్రత్యేకంగా చీరాలకు వచ్చినట్లు వివరించారు. ఆశ్రమ ప్రతినిధులు భగవాన్‌ను సత్కరించారు. అలాగే సినీ ప్రియులు భగవాన్‌తో ఫొటోలకు ఉత్సాహం చూపారు.

పేద మహిళకు తోపుడు బండి అందజేత

అద్దంకిటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేద మహిళ జీవనోపాధి కోసం తోపుడు బండిని అందజేశారు. శుక్రవారం అద్దంకికి చెందిన చుండూరి రామారావు, వెంకట సుశీల చారిటబుల్ ట్రస్ట్, నాగసూరి అంజనేయులు జ్ఞాపకార్థం వారి కుమారుడు సత్యనారాయణ, 12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌బాబుల ఆర్థిక సహకారంతో అద్దంకిలోని గరటయ్య కాలనీకి చెందిన చేబ్రోలు శేషమ్మకు జీవనాధారం కోసం తోపుడు బండిని అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళి సుధాకర రావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :పంగులూరు సబ్‌స్టేషన్ పరిధిలో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అంజనేయులు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

అంగన్వాడీలకు.. నిధులు

5వ పేజీ తరువాయి

నిధులు విడుదల చేసింది. అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణాల్లోనే ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నిమ్మ, నారింజ, బొప్పాయి, అరటి వంటి పండ్ల మొక్కలతో పాటు తోటకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి కూరల మొక్కలు పెంచి వాటితోనే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం సూచించింది.

- గుంటూరు జిల్లా: 152 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.54.72 లక్షలు, 188 కేంద్రాల్లో మంచినీటి సదుపాయానికి రూ.32 లక్షలు, పోషణ వాటిక, వర్షపు నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన కింద 204 కేంద్రాలకు రూ.93.43 లక్షలు కేటాయించింది.
- బాపట్ల జిల్లా: 190 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.68.40 లక్షలు, 258 కేంద్రాల్లో మంచినీటి సదుపాయాలకు రూ.43.86 లక్షలు, 261 కేంద్రాల్లో పోషణ వాటికలు, వర్షపు నీటి నిర్వహణకు కోటీ 19 లక్షల 8 వేలు కేటాయించింది.
- పల్నాడు జిల్లా: 243 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.87.48 లక్షలు, 369 కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలకు రూ.62.73 లక్షలు, 67 కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పోషణ వాటికల ఏర్పాటు, వర్షపునీటి యాజమాన్యం నిర్వహణకు రూ.30.68 లక్షలు కేటాయించింది.

గ్రామీణ ఆరోగ్య కేంద్రం ఎప్పుడూ మూతే

నీరుగారిన ఆరోగ్య సేవల లక్ష్యం

ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడి



మూతపడిన మేదరమెట్లలోని విలేజ్ హెల్త్ క్లినిక్

మేదరమెట్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆయుష్ ఆరోగ్య మందిర్ (గ్రామీణ ఆరోగ్య కేంద్రం) సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లలేని చిన్న చిన్న వ్యాధుల రోగులకు ఆ రోగ్య సేవలను అందించడానికి గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రజలకు చేరువ చేయాలనుకున్న ఆరోగ్య సేవలు లక్ష్యం నీరుగారిపోతోంది. గ్రామీణ సచివాలయలతో పాటుగా ఏర్పాటు చేసిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాలలో బీఎస్సీ నర్సింగ్ చదివిన ఉద్యోగ, ఏఎన్ఎం, ఆశాలు పని చేస్తారు. మేదరమెట్ల సచివాలయం - 3 పరిధిలో సుమారు రూ. 40 లక్షల వ్యయంతో కేంద్రం నిర్మించారు. మేదరమెట్ల మార్కెట్ యార్డు ఆ వరణంలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లీనిక్ 3(గ్రామీణ ఆరోగ్య కేంద్రం)ని గత ఎన్నికలకు ముందే ప్రారంభించారు. మూడు నెలలుగా ఈ ఆరోగ్య కేంద్రం ఎప్పుడు మూసే ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి పరిశీలనకు వెళ్లగా గ్రామీణ ఆరోగ్య కేంద్రం తలుపులు మూసి ఉన్నాయి. అక్కడ ఉన్న రైలింగ్‌లపై దుస్తులు ఆరవేసి ఉన్నాయి. ఈ విషయమై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు చిట్టిబాబును వి వరణ అడుగగా అక్కడ పని చేస్తున్న సిబ్బందిలో ఒకరు సెలవు పెట్టారని చెప్పారు. అయితే తలుపులు మూసి ఉండడానికి కారణం ఏమిటో తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ పునరుద్ధరణ అనివార్యం

చీరాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : చోరీలు జరుగుతున్నాయి. సొత్తు పోతోంది. దొంగలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నారు. చీరాల డివిజన్ పరిధిలో తాళాలు వేసిన ఇళ్లను దొంగలు ఎంచుకుంటున్నారు. చోరీలకు పాల్పడుతున్నారు. వీటి నియంత్రణకు మళ్లీ ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఎలా పనిచేస్తుంది..

ఎల్‌హెచ్‌ఎంఎస్ అంటే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం. గతంలో ఈ విధానంపై పోలీసులు ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేశారు. ఊరు వదిలి వెళుతూ ఇంటికి తాళంవేసి వెళ్లే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం తెలుపుతారు. దాంతో పోలీసులు ఆ ఇంటి వద్ద కెమెరా ఏర్పాటు చేస్తారు. ఆ కెమెరాలో విజువల్స్ కనిపించే విధంగా పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తారు. తాళం వేసిన ఇంటికి ఎవరైనా వెళితే వెంటనే ఆ విజువల్ కంట్రోల్ రూంకు చేరుతుంది.

దీంతో కంట్రోల్ రూం నుంచి బీట్‌లో ఉన్న పోలీసులకు సమాచారం అందజేస్తారు. కేవలం 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో బీట్ కానిస్టేబుళ్లు ఆ ఇంటికి చేరుకుంటారు. దొంగలను పట్టుకుంటారు. అయితే జిల్లాల విభజన తరువాత సిబ్బంది కొరతతో ఎల్‌హెచ్‌ఎంఎస్‌కు తెరపడింది. దీంతో మళ్లీ దొంగలు రెచ్చిపోతున్నారు.

పలు ప్రాంతాల్లో అపరిచితుల కదలికలు

డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో అపరిచితుల కదలికలు ఎక్కువైనట్లు ప్రజలు చెప్తున్నారు. కొందరు యాచకులుగా పగలు వివిధ ప్రదేశాల్లో తిరుగుతూ అనువైన గృహాలను ఎంపిక చేసుకుని రాత్రిళ్లు చోరీకి పాల్పడుతున్నట్లు చెప్తున్నారు. ఈ క్రమంలో పెద్ద దొంగతనాలు పోలీసుల దృష్టికి వస్తున్నా, పలు చిల్లర దొంగతనాలు పోలీస్ స్టేషన్‌కు చేరటం లేదని చెప్తున్నారు. ఈ క్రమంలో అపరిచితుల కదలికలను కేవలం పోలీసులు గుర్తించాలనుకోవటమే కాకుండా, అనుమానితులు ఎవరన్నా తమ ప్రాంతాల్లో సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు తెలపాల్సిన బాధ్యత పౌరులపై కూడా ఉంది. అప్పుడే చోరీలకు చెక్ చెప్పేందుకు మార్గం సుగమం అవుతుంది.

వాణి వినిపించారు..

కీలకంగా వ్యవహరించిన గొట్టిపాటి

అంచనాల కమిటీ సభ్యుడిగా ఏలూరి

నియోజకవర్గ సమస్యలను వివరించిన కొండయ్య

అసెంబ్లీ సమావేశాల్లో మన ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

శాసన సభ సమావేశాల్లో వాణి వినిపించటంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, కొండయ్య యాదవ్‌లు సఫలీకృతులయ్యారు. విద్యుత్ చార్జీల పెంపు అంశం కీలకాంశం కావటంతో సంబంధిత శాఖ మంత్రి అయిన గొట్టిపాటి రవికుమార్ దీటైన ప్రసంగాలతో అధికారపార్టీ సభ్యులను ఆకట్టుకోగలిగారు. ప్రతిష్ఠాత్మకమైన విజనరీ లీడర్ అవార్డు పొందిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరికి అసెంబ్లీలో సభ్యులు అభినందనలు తెలపటం విశేషం. అదేసమయంలో ఆయనకు అంచనాల కమిటీ సభ్యుడిగా స్థానం దక్కింది. చీరాల ఎమ్మెల్యే కొండయ్య యాదవ్ రెండు పర్యాయాలు సమావేశాల్లో మాట్లాడి నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలిగారు. ఈనెల 11న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ముగిసిన విషయం తెలిసిందే. ఈ సమావేశాల్లో రాష్ట్రస్థాయి అంశాల్లో విద్యుత్ శాఖ అంశం రెండు సభల్లోను చర్చనీయాంశంగా మారింది. సమావేశాలకు ప్రతిపక్షం హాజరుకాకపోయినప్పటికీ విద్యుత్ శాఖ మంత్రిగా రవికుమార్ సమస్యను వివరించేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త నిర్ణయాలతోనే ప్రజలపై భారం మోపే పరిస్థితి ఎదురైందని వివరించటంలో సఫలీకృతులయ్యారు. అయితే శాసనమండలిలో ప్రతిపక్ష వైసీపీ సభ్యుల నుంచి ఎదురైన విమర్శల దాడిని తిప్పికొట్టడంలో కూడా రవికుమార్ ముందున్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స విద్యుత్ సమస్యపై కూటమి ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే ప్రయత్నం చేయగా రవికుమార్ పూర్తి ఆధారాలతో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అస్తవ్యస్త నిర్ణయాలను వివరించారు. ఈ విషయంలో రవికుమార్ చురుగ్గా వ్యవహరించటం పట్ల సమావేశాల అనంతరం సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, శాసనమండలిలో టీడీపీ సభ్యులు అభినందించటం విశేషం. ఇక అసెంబ్లీలో విద్యుత్ సమస్యపై గత ప్రభుత్వ వైఫల్యాలు వివరించటంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కూడా ముఖ్యపాత్ర పోషించారు. రెండు పర్యాయాలు అసెంబ్లీలో ఇదే అంశంపై ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఇతర అంశాలపై తీసుకున్న నిర్ణయాలతో రాష్టానికి జరిగిన నష్టాన్ని వివరించారు. ఎమ్మెల్యే ఏలూరి నియోజకవర్గానికి సంబంధించిన రైతు సమస్యలు, రోడ్లు, మత్స్యకార సమస్యలపై ఆయా శాఖల మంత్రులు, అధికారులకు కూడా వివరించి కొన్నింటికి అప్పటికప్పుడే పరిష్కారం చేయించుకోగలిగారు. అలాగే ప్రతిష్ఠాత్మకమైన విజనరీ లీడర్ అవార్డు సాధించిన ఏలూరికి సీఎం చంద్రబాబు నుండి ముఖ్య నాయకులందరూ అభినందనలు తెలిపారు. సీనియర్ ఎమ్మెల్యే కొణతాల అసెంబ్లీలో ఆ అంశాన్ని ప్రస్తావించి ఆయన అవార్డు పొందటం శాసనసభకే గౌరవమని కొనియాడారు. ప్రజాసేవలో ఏలూరి సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు సూచించారు. అసెంబ్లీ సమావేశాల చివరి రోజు జరిగిన నియామకాల్లో అసెంబ్లీ అంచనాల కమిటీలో ఏలూరికి స్థానం దక్కింది. చీరాల ఎమ్మెల్యే కొండయ్య రెండు పర్యాయాలు అసెంబ్లీలో మాట్లాడుతూ చేనేత సమస్యలను, డ్రైనేజీ సమస్యలను ప్రధానంగా వివరించారు. వైద్యశాల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.



గతంలో మేన కోడలు తో వివాహం (ఫైల్)



ఇటీవల లావణ్యతో వివాహం (ఫైల్)

నిత్యపెళ్లికొడుకు కోసం అన్వేషణ

ఇద్దరితో పెళ్లిళ్లు

మరొకరితో సహజీవనం

చీరాల టూటౌన్‌లో కేసుతో విషయం వెలుగులోకి..

చీరాలటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం ముత్తుపల్లి గ్రామానికి చెందిన పిట్టు నాగరాజు రెడ్డి నిత్య పెళ్లికొడుకు అవతారమెత్తాడు. ఆయన భోపాల్‌లో సైనికుడుగా పనిచేస్తున్నాడు. జిల్లాలో ముగ్గురు యువతులను మోసగించి వివాహాలు చేసుకున్నాడు. సెలవులపై స్వగ్రామం వచ్చి తప్పించుకు తిరుగుతున్నాడు. చీరాలకు చెందిన యువతి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. చీరాల పరిధి లోని కొత్తపేటకు చెందిన మేడికొండ లావణ్య భర్తతో విభేదించి విడాకులు తీసుకుంది. ప్రస్తుతం ఆమెకు ఒక కుమార్తె. దీంతో ఉపాధి కోసం ప్రయత్నించే క్రమంలో నిజాంపట్నంకు చెందిన జవాన్ నాగరాజు 2021లో పరిచయం అయ్యాడు. ఉపాధి కల్పిస్తానని నమ్మబలికించాడు. ఆ తరువాత ఆమెతో ప్రేమ వ్యవహారం నడిపాడు. దీంతో గతనెల 17వ తేదీన లావణ్యను వివాహం చేసుకున్నాడు.

తీగలాగితే డొంక కదిలింది

ఈ నెలలో రెండుసార్లు భార్య లావణ్య వద్దకు వచ్చి వెళ్లాడు. అయితే భర్త తరపు బంధువుల ద్వారా ఏడాది క్రితమే ఇంటర్ సెకండియర్ చదువుతున్న మేనకోడలు, మైనర్ తో వివాహం జరిగినట్లు ఫొటోలు అందాయి. దీంతో అవాక్కయిన లావణ్య భర్త పూర్వాపరాలపై ఆరా తీసింది. ఈక్రమంలో వీరిద్దరితో కాకుండా గతంలోను భర్త స్వగ్రామంలోనే మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని మోసగించడంతో 2020లో నిజాంపట్నం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. ఆ కేసు ప్రస్తుతం నడుస్తోంది. భర్త భాగోతమంతా తెలుసుకున్న లావణ్య మనస్తాపం చెంది ఈనెల 7వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈమేరకు చీరాల టూటౌన్‌లో కేసు నమోదయింది. గుంటూరు హాస్పిటల్లో చికిత్స పొంది డిశ్చార్జి అయిన లావణ్యను గురువారం టూటౌన్ పోలీసులు విచారించగా విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ప్రస్తుతం సెలవుపై స్వగ్రామంలో ఉన్న సైనికుడు నాగరాజు రెడ్డి కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం

5వ పేజీ తరువాయి

ఎస్‌టీపీల నిర్మాణాన్ని గాలికొదిలేసింది. జాతీయ గ్రీన్‌ట్రిబ్యునల్ మొట్టికాయలు వేసినా గత వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. మున్సిపాల్టీలలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు స్థలాలను కేటాయించలేదు. పనులు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం ఎస్‌టీపీల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ పరిస్థితుల్లో ప్రజారోగ్యం దృష్ట్యా ఎస్‌టీపీల పనులు వేగవంతంగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను అధికారులు గుర్తించాలి. స్థలాలను కేటాయించి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి.

తెనాలిలోనే పనులు..

గుంటూరు జిల్లాలో ఒకటి, పల్నాడు జిల్లాలో మూడు, బాపట్ల జిల్లాలో రెండు మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపి నిధులు విడుదుల చేసింది. అయితే కొన్ని మున్సిపాలిటీల్లో అమృత్ పథకానికి ఈ ఎస్‌టీపీలను అనుసంధానం చేశారు. అయితే మూడు జిల్లాల్లో ఆరు మున్సిపాలిటీలకు ఒక్క గుంటూరు జిల్లా తెనాలిలో మాత్రమే మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు జరుగుతున్నాయి. తెనాలిలో అమృత్ పథకం కింద రూ.31.50 కోట్లతో పనులు చేస్తున్నారు. వినుకొండ మున్సిపాల్టీలో ముట్లకుంటకాలనీ ప్రాంతంలో 5.70 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఈ స్థలంలో కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టారు. వినుకొండలో చెక్కవాగు నిర్మల స్కూల్ ప్రాంతంలో 5.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మరో ప్లాంట్ నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. వీటికి రూ.18.60 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పిడుగురాళ్లలో రూ.18.42 కోట్లతో 5.90 ఎంఎల్‌డీ సామర్థ్యంతో హనుమందిర్ రోడ్డులో, 5.20 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్సీ శ్మశానవాటిక సమీపంలో మరో ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించారు. ఆయా ప్రాంతాల్లో ప్లాంట్ల నిర్మాణానికి స్థలం కేటాయించలేదు. ఈ రెండు మున్సిపాల్టీలలో నాలుగు ఎస్‌టీపీల నిర్మాణ పనులు టెండర్‌ను శ్రీకృష్ణ ఎన్‌వీరో ఇంజనీర్స్ విజయవాడ సంస్థ దక్కించుకుంది. చిలకలూరిపేట మున్సిపాల్టీలో అమృత్ పథకంలో భాగంగా రూ.69.53 కోట్లతో చేపట్టిన ఎస్‌టీపీ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

బాపట్ల జిల్లా బాపట్ల మున్సిపాల్టీలో రూ.4.98 కోట్లతో 3 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ఎస్‌టీపీని కంపోస్టు యార్డు ప్రాంతంలో నిర్మించాలి. ఇందుకు సంబంధించి స్థలం కేటాయింపు జరగలేదు. చీరాల మున్సిపాల్టీలో రూ.8.30 కోట్లతో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఐకేనగర్ దండుబాట ప్రాంతంలో నిర్మించాలని స్థలాన్ని గుర్తించారు. అయితే స్థల కేటాయింపు మధ్యలోనే నిలిచిపోయింది. ఈ రెండు మున్సిపాల్టీలలో ఎస్‌టీపీల టెండర్‌ను సింగన్ ప్రాజెక్టు లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ దక్కించుకుంది.

29 న మార్టూరులో అఖండ కర్పూరజ్యోతి

మార్టూరు,నవంబరు22(ఆంధ్రజ్యోతి):స్థానికంగా శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 29 వతేదీ శుక్రవారం రాత్రి 3 క్వింటాళ్ల కర్పూరంతో అఖండ కర్పూరజ్యోతిని భక్తులు వెలిగిస్తున్నట్లు శుక్రవారం భక్తబృందం తెలిపింది.గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో దీక్షధారులకు ప్రత్యేకంగా భిక్షను, భక్తులకు ప్రసాదాన్ని ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు.

అమ్మ ఆశ్రమంలో అన్నదానం

రోటరీ డిస్ట్రిక్ 3,150 గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి జన్మదినం సందర్భంగా శుక్రవారం మార్టూరు రోటరీ క్లబ్ సభ్యులు అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేశారు.

పెన్నులు, స్వీట్లు పంపిణీ

ఇంకొల్లు,నవంబరు 22,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కలపాలెంలో శ్రీసత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెన్నులు,స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏలూరి శ్రీకృష్ణమూర్తి,సాయి భక్తులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు ప్రభుత్వం ఊరట

చీరాలటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ దారులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించిందని, ఏ కారణంతోనైనా పెన్షన్ అందుకోలేక పోయిన వారు మూడు నెలలది ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించినట్లు చీరాల మండల ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల అందినట్లు చెప్పారు.



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

చీరాలటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సమస్యలపరిష్కారం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతినెలా మూడవ శుక్రవారం గిరిజనులకు ప్రత్యేకంగా అర్జీల వేదిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలోమూడు అర్జీలు వచ్చినట్లు వివరించారు. ప్రాధాన్యతాక్రమంలో వాటిని పరిష్కరించనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ వెంట ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, ప్రభుత్వ సిబ్బంది ఉన్నారు.

రైతులు అందుబాటులో ఉండాలి

పంగులూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రీ సర్వే జరిగిన గ్రామాలలో విస్తీర్ణ వ్యత్యాసాల సమస్యల పరిష్కారం కోసం ఆయా గ్రామ రైతులు ప్రత్యేక బృందాలకు అందుబాటులో ఉండి సహకరించాలని తహసీల్దార్ పి.సింగారావు కోరారు. రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారం కోసం నియమించిన ప్రత్యేక సిబ్బంది శుక్రవారం నుంచి తగు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

అంతంతమాత్రంగా జీడిపప్పు పరిశ్రమ

వేటపాలెం(చీరాల), నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : జీడి పరిశ్రమ గతం ఘనం .. వర్తమానం అంతంత మాత్రంగా ఉందని జీడిపప్పు ఉత్పత్తిదారుడు ప్రత్తి వెంకటసుబ్బారావు అన్నారు. శనివారం జాతీయ జీడిపప్పు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ముందస్తుగా తమ కార్ఖానాలో వేడుకలు నిర్వహించారు. పలువురు జీడి కార్మికులను సన్మానించారు. భవిష్యత్ కార్యాచరణపై ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీడిపప్పు కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

వలస దారులకు పెన్షన్ చెల్లింపులో వెసులుబాటు

పంగులూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :నెలవారీ సామాజిక పించన్లు పొందే లబ్ధిదారులు రెండు నెలల పాటు వలస వెళ్లిన సందర్భంలో మూడో నెల పించన్‌తో కలిపి మూడు నెలల మొత్తం ఒకేసారి పొందే వెసులుబాటు కల్పించారని ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు.



నాగరాజును అభినందిస్తున్న డీఎస్పీ, సీఐ

పోలీసు వ్యవస్థకు నాగరాజు గర్వకారణం

- చీరాల డీఎస్పీ ఎండి మోయిన్

చీరాలటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ రీత్యా బిజీగా ఉన్నా క్రీడలపై మక్కువను విడనాడకుండా తనదైన శైలిలో రాణిస్తున్న నాగరాజు పోలీసు వ్యవస్థకు గర్వకారణంగా నిలిచారని డీఎస్పీ ఎండి మోయిన్ అన్నారు. పశ్చిమబెంగాల్లో ఇటీవల జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో కానిస్టేబుల్ బంగారు పతకం సాధించారు. దీంతో గురువారం జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ అభినందించగా శుక్రవారం విధుల్లోకి చేరాక డీఎస్పీ, సీఐ నాగభూషణం, ఎస్సై రాంబాబులు ప్రత్యేకంగా అభినందించారు. మరిన్ని క్రీడల్లో పాల్గొని ఉన్నతంగా రాణించాలని వారు ఆకాంక్షించారు.

రెండోసారి గోల్డ్‌లోన్ నగదు వసూలుపై ఫిర్యాదు

అద్దంకి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): గోల్డ్‌లోన్ తీసుకొని అదే రోజు చెల్లించినప్పటికీ తనకు తెలియకుండా తన తండ్రి వద్ద ఓ ప్రయివేట్ గోల్డ్ ఫైనాన్స్ వ్యాపారి మళ్లీ వసూలు చేశారని ముండ్లమూరు మండలం శంకరాపురంకు చెందిన మేదరమెట్ల హరికృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు ముండ్లమూరు మండలం శంకరాపురం కు చెందిన మేదరమెట్ల హరికృష్ణ అద్దంకి పట్టణంలోని ఓ ప్రయివేట్ గోల్డ్ ఫైనాన్స్ లో ఈ ఏడాది జూన్ 10 వ తేదీన బంగారం తాకట్టు పెట్టి 3,96,416 రూపాయల రుణం తీసుకున్నాడు. అయితే తన బంధువుల వద్ద నగదు తీసుకున్న హరికృష్ణ అదే రోజు ఆ డబ్బును తిరిగి చెల్లించాడు. అదే రోజు బంగారం తిరిగి ఇవ్వటానికి కుదరదని గోల్డ్ ఫైనాన్స్ సిబ్బంది చెప్పారు. అయితే హరికృష్ణ అనారోగ్యంతో వైద్యశాలలో చేరాడు. ఆ సమయంలో గోల్డ్‌లోన్ ఫైనాన్స్ సిబ్బంది శంకరాపురం వెళ్లి గోల్డ్‌లోన్ గడువు ముగిసిందని చెప్పటంతో ఆయన తండ్రి రుణం మొత్తం చెల్లించాడు. తరువాత ఈ విషయం తెలుసుకున్న హరికృష్ణ గోల్డ్ ఫైనాన్స్ కార్యాలయానికి వెళ్లి అడగగా సరైన సమాధానం చెప్పలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. హరికృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

అవీ..ఇవీ



లండన్ వేదికగా అవార్డు అందుకుంటున్న విక్రమ్ నారాయణరావు

పారిశ్రామికవేత్త నారాయణరావుకు అభినందనల వెల్లువ

చినగంజాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) :చినగంజాం మండలం గొన సపూడి గ్రామానికి చెందిన ప్రముఖ యువ పారిశ్రామికవేత్త విక్రం నారాయణరావుకు లండన్ వేదికగా అంతర్జాతీయ పురస్కారం దక్కటం పట్ల అభినందనలు వెల్లువెత్తాయి. విక్రమ్ నారాయణకు లండన్ వేదికగా 2024 లాయిడ్ హెల్త్‌కేర్ ప్రైవేట్ కంపెనీ(ఫార్మాసుటికల్ కంపెనీ ఇన్ ఇండియా) వేగవంతమైన వ్యాపార సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ పురస్కారం దక్కింది. బ్రిటీష్ పార్లమెంట్ లండన్ వేదికగా ఇంటర్నేషనల్ బుక్‌ఆఫ్ హానర్ ఇంగ్లాండ్ ప్రకటించినట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అవార్డు గ్రహీత నారాయణ తెలిపారు. అరుదైన అవార్డు లండన్ వేదికగా లభించటం పట్ల శుక్రవారం ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పొద వీరయ్య, కొండ్రగుంట శ్రీహరిబాబు, బత్తుల శ్రీనివాసరావు, ఎడ్లపల్లి సురేష్‌బాబు, నార్నె సత్యన్నారాయణ, దావూరి రమేష్, పరిటాల అంజిబాబు తదిరులు ఉన్నారు.



అద్దంకిరూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్సై మహ్మద్‌రఫీతో మాట్లాడుతున్న డీఎస్పీ మోయిన్

జాతీయ రహదారిపై వాహనాలు ఆగకుండా చూడండి

మేదరమెట్ల, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి వెంబడి వాహనాలు నిలపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని చీరాల డీఎస్పీ మోయిన్ సూచించారు. శుక్రవారం అద్దంకి రూరల్ సర్కిల్ పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సీఐ మల్లికార్జునరావు మేదరమెట్ల ఎస్సై మహ్మద్‌రఫీలకు పలు సూచనలు చేశారు. అనంతరం మేదరమెట్ల, కొరిశపాడు పోలీసు స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళలో దొంగతనాలు జరగకుండా బీట్లు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి వెంబడి ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సోషల్‌మీడియాలో ఎవరైనా పోస్టులు పెడిగే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట కొరిశపాడు ఎస్సై సురేష్, ఆయా స్టేషన్ల సిబ్బంది ఉన్నారు.



కొమ్మినేనివారిపాలెంలో ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

ఆధార్ కార్డులు లేని వారు వెంటనే తీయించుకోవాలి

బల్లికురవ. నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ కార్డులు లేని వారు వెంటనే ప్రభుత్వం నిర్వహిస్తున్న సెంటర్లకు వచ్చి నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. శుక్రవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో జరుగుతున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈసందర్భంగా అమె సిబ్బందితో మాట్లాడుతూ ఆధార్ కార్డుల కోసం వచ్చే వారికి సత్వరమే నమోదు చేసి పంపించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో తనిఖీ చేశారు. సిబ్బంది అటెండెన్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు సత్వరమే ప్రజలకు అందేలా జియోట్యాగ్ సర్వేను పూర్తి చేయాలని సూచించారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

● మాజీ మంత్రి డాక్టర్ పాలేటి వినతి

చీరాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక గడియారస్తంభం సెంటర్లో టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్‌లకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట నాయకులు కటకం శ్రీనివాసరావు, బుర్ల సాంబశివరావు తదితరులు ఉన్నారు.

వినియోగంలోకి మినీ స్టేడియం

● శాప్ అధికారుల పరిశీలన

● ఎమ్మెల్యే ఏలూరి చొరవతో అధికారుల చర్యలు

పర్చూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు పర్చూరులో ఐదేళ్ల క్రితం నిర్మించి నిరుపయోగంగా ఉన్న మినీ స్టేడియం వినియోగంలోకి రానుంది. స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో శాప్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు వారు ప్రకటించారు. గత టీడీపీ హయాంలో క్రీడాకారులకు ప్రోత్సాహం అందించి జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చొరవతో పర్చూరులో రూ.2కోట్లతో ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈనిధులతో క్రీడా ప్రాంగణం యద్ధప్రాతిపదికన రూపుదిద్దుకుంది. ప్రారంభించుకోవాల్సిన తరుణంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత ఐదేళ్లు ప్రాంగణం వైపు ప్రభుత్వం కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రాంగణం ప్రారంభానికి నోచుకోక ముళ్లచెట్లు, పొదలతో నిండిపోయింది. దీంతో క్రీడాకారులు తీవ్ర ఆవేదన చెందారు. తిరిగి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో స్టేడియానికి జీవం పోసినట్లయింది. ఎమ్మెల్యే ఏలూరి చొరవతో క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా దృష్టిసారించారు.



పర్చూరులోని ఎన్టీఆర్ మినీ స్టేడియంను పరిశీలించి వివరాలు సేకరిస్తున్న సాఫ్ అధికారులు

శాప్‌అధికారుల పరిశీలన...

మినీ స్టేడియంను వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా శాప్ అధికారులు దృష్టిసారించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శాప్ ఏఈ రాంబాబు నేతృత్వంలో మినీ స్టేడియంను పరిశీలించారు. మరమ్మతులకు కావాల్సిన వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. యద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో తంగెళ్ళ మల్లికార్జునరావు, పఠాన్ బాజీ, ఖోఖో కోచ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మించి ఏడాది.. ప్రారంభించేది ఎన్నటికో?



యద్దనపూడిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

యద్దనపూడి,(మార్టూరు)నవంబరు22(ఆంధ్రజ్యోతి): సుమారు రూ. 75 లక్షల వ్యయంతో యద్దనపూడిలో ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం నిర్మించి ఏడాదిదాటినా ఇంతవరకు అందులో సేవలు అందించడం లేదు. ఆస్పత్రి నిర్వహిస్తున్న పాత భవనం నుంచి కొత్త భవనంలోకి ఆరోగ్య కేంద్రాన్ని మార్చలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఆభవనంలో విద్యుత్ సరఫరా లేదనే కారణంతో పాత భవనంలోనే ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. వాస్తవంగా పాత ఆరోగ్య కేంద్ర భవనం శిథిల దశకు చేరింది. వారం రోజుల క్రితం డీఎంహెచ్‌వో విజయమ్మ ఆస్పత్రిని పరిశీలించారు.

లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన కొత్త భవనాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. పాత భవనం నుంచి కొత్త భవనంలోకి ఆస్పత్రిని మార్చాలని వైద్యులను కోరారు. అయినా పట్టించుకోకపోవడం గమనార్హం.

భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

బల్లికురవ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపాలెం గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం,హిందూ ధర్మపరిషత్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఈసందర్భంగా గ్రామానికి చెందిన మహిళ భక్తులు పెద్ద పూజలలో పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్తీక మాసం కావటం సామూహిక కుంకుమ పూజలు చేస్తుండటంతో ప్రజలు పెద్ద ఎత్తున చేరి తిలకించారు. ఈసందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థాన దాస సాహిత్య ప్రాజెక్టు ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో హిందు ధర్మాన్ని కాపాడేందుక ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక స్వామి అయినవోలు శోభనాచార్యులు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కోఆర్డినేటర్ రావినూతల రామకృష్ణ, మాదాల దానయ్య, పెద్దిశెట్టి వెంకటాద్రి, పుట్ట వీరాంజనేయులు, తొట్టెంపూడి కుమారి, చిగురుపాటి శంకరావు తదితరులు పాల్గొన్నారు.



గంగపాలెంలో సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

పొగాకు వద్దు - ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

పొలం పిలుస్తోందిలో వ్యవసాయాధికారి వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు సాగును తగ్గించి ఇతర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని కుంకుపాడు, కోటికలపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏవో మాట్లాడుతూ గత సంవత్సరంలో పోలిస్తే ఈ సంవత్సరం పొగాకు సాగు గణనీయంగా పెరిగిందని, దీని వలన ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. పొగాకు పంటలకు బీమా లేదన్నారు. వరి, మొక్కజొన్న, శనగ, మినుము, పెసర, వేరుశనగ, జొన్న పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా చేయించుకోవాలని, డిసెంబరు 15తో నమోదు గడువు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గాలం వెంకటేశ్వర్లు, చంద్ర బ్రహ్మయ్య, వ్యవసాయ సహాయకులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

పప్పుదినుసులు, మొక్కజొన్న సాగు చేపట్టాలి

పంగులూరు :పొగాకు ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు, మొక్కజొన్న సాగు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో పొగాకు బదులుగా పప్పుదినుసులు, మొక్కజొన్న సాగు చేపట్టాలని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు వలన కలిగే దుష్ఫలితాలు, సాగు పెరిగితే తలెత్తే ఇబ్బందులను రైతాంగానికి వివరించారు.

పప్పు దినుసులు, మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను తెలియచేశారు. వరి సాగు చేసే రైతులు డిసెంబరు 31 లోగా, పప్పు దినుసులు, మొక్కజొన్న, అపరాలు సాగు చేసే రైతులు 15 లోగా పంటల బీమా చేయించుకోవాలని కోరారు. వివరాల కోసం రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు .

అద్దంకిలో దొంగల సంచారం

సీసీ కెమెరాల ఫుటేజ్‌లో గమనించి రావటంతో పరార్

ఆలస్యంగా వెలుగులోకి....

అద్దంకి, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): దొంగల సంచారాన్ని గుర్తించి కుక్క మొరగటంతో అనుమానించి సీసీ కెమెరాల ఫుటేజ్ గమనించి స్థానికులు రావటంతో దొంగలు పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అద్దంకి పట్టణంలోని కలవ కూరు రోడ్డు లో వైఎస్ఆర్ అపార్ట్‌మెంట్ సమీపంలో ఇటుకబట్టీల యజమాని ప్రసాదరెడ్డి నివాసం ఉంటున్నాడు. ఇంటి పక్కనే తనకు సంబంధించిన టిప్పర్‌లు, ట్రాక్టర్‌లను నిలిపి ఉంచారు. ఈ క్రమంలో ఈ నెల 19 వ తేదీ అర్ధ రాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో బొలెరో వాహనంలో ముగ్గురు వ్యక్తులు, రెండు మోటార్‌సైకిళ్లపై ఇద్దరు మహిళలతో పాటు నలుగురు వ్యక్తులు వచ్చారు. దీంతో ప్రసాదరెడ్డి ఇంట్లో ఉన్న కుక్క పెద్ద గా మొరిగింది. దీంతో మెలకువ వచ్చిన ప్రసాదరెడ్డి కుటుంబసభ్యులు నిద్ర మేల్కొని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను గమనించారు. టిప్పర్‌లలో డీజిల్ దొంగిలించేందుకు వచ్చినట్లు గుర్తించారు. వెంటనే ప్రసాదరెడ్డి కుక్కను తీసుకొని బయటకు వెళ్లాడు. దీంతో దొంగలు తమతో పాటు తెచ్చిన ఖాళీ ఆయిల్ క్యాన్‌లను, పైప్ లను అక్కడే వదిలివేసి వెళ్లారు. మొత్తం 6 క్యాన్‌లు ఉండగా రెండు క్యాన్ లలో అప్పటికే సుమారు 70 లీటర్ల ఆయిల్‌ను తీసినట్లు గుర్తించారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌లో పరిశీలించగా అక్కడ నుంచే దొంగలు సెల్ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీస్‌ల దృష్టికి తీసుకుపోయినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, విచారణ కూడా చేయలేదని ప్రసాదరెడ్డి ఆరోపిస్తున్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించే అవకాశం ఉన్నప్పటికీ పోలీస్‌లు చొరవతీసుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది.



యజమాని రావడంతో పారిపోతున్న దొంగలు (ఇన్‌సెట్లో) వాహనాల నుంచి తీసిన డీజిల్ డబ్బాలు

గృహోపకరణాలకు సోలార్ విద్యుత్

సోలార్ విద్యుత్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు



పర్చూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : గృహోపకరణాలకు సోలార్ విద్యుత్ ఎంతగానో దోహద పడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిగ్యూటీవ్ ఇంజనీర్ తులసీరామ్ అన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై శుక్రవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సిబ్బందితో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసే విధంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించాలన్నారు. సోలార్ విద్యుత్‌కు సంబంధించి తక్కువ వడ్డీతో బ్యాంకు నుంచి రుణసౌకర్యం పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం సోలార్ విద్యుత్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఏడీఈ ఎస్.రమేష్‌బాబు, ఏఈలు లకావత్ రమేష్ నాయక్, కె.రామకృష్ణ, రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా సోలార్ సిస్టంలను అమర్చాలి

చీరాలటౌన్ : వినియోగదారులకు వేగవంతంగా సోలార్ సిస్టంలను అమర్చాలని విద్యుత్ జిల్లా నోడల్ ఆఫీసర్ తులసీరామ్ అన్నారు. చీరాల ఈఈ జాన్‌థామస్ ఆధ్వర్యంలో స్థానిక డివిజన్ కార్యాలయంలో సూర్యఘర్ సోలార్ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సోలార్ కాంట్రాక్టర్లకు ప్రత్యేక సూచనలు చేశారు. పలువురు ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఏలూరిని గజమాలతో సత్కరిస్తున్న కారంచేడు టీడీపీ నేతలు

ఏలూరిని సత్కరించిన కారంచేడు టీడీపీ నేతలు

కారంచేడు(పర్చూరు), నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : విజనరీ లీడర్ అవార్డు గ్రహీత పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావును శుక్రవారం కారంచేడు తెలుగుదేశం పార్టీ నేతలు తాడేపల్లిలో భారీ గజమాలతో సత్కరించి అభిమానం చాటుకున్నారు. లండన్ వేదికగా అరుదైన అవార్డు దక్కటం పర్చూరు నియోజకవర్గానికే గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు పోతిని ఉదయ్, నల్లగొర్ల శ్రీరాములు, జాగర్లమూడి ప్రహ్లాద, చాగంటి లక్ష్మీనారాయణ, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరికి అభినందనలు

ఇంకొల్లు : విజనరీ లీడర్ అవార్డు గ్రహీత పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ఇంకొల్లు మండలం పెదనక్కలపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువతో ఏలూరిని సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఏలూరిని అభినందించిన వారిలో బాచిన సత్యనారాయణ, వై.శ్రీనివాసచక్రవర్తి, బి.శ్రీనివాసరావు, సిహెచ్ అజిత్, కె.చంద్రపాల్, ఎం.సుబ్బారావు తదితరులు ఉన్నారు.



ఎంపికైన విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థినులు

చీరాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థినులు పలువురు ఇంటర్ యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ క్రమంలో శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులకు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు అభినందించారు. ఎంపికైన విద్యార్థినులకు పోటీలలో గెలుపొందేందుకు వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ హరికిషన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలి



పేర్ని సత్యనారాయణ (అధ్యక్షుడు)



మస్తాన్‌వలి (కార్యదర్శి)

ఇంకొల్లు,నవంబరు 22,(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులతో చేయించిన బోధనేతర పనులను తగ్గించాలని యూటీఎఫ్ బాపట్ల జిల్లా గౌరవాధ్యక్షులు పాపారావు డిమాండ్ చేశారు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశానికి ఎన్నికల పరిశీలకులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై శ్వేతపత్రం ప్రకటించాలన్నారు.జిల్లా కార్యదర్శి యు.చెంచయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దు చేయాలని,బదిలీ నియామకాలు,ప్రమోషన్లపై చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం పలువురు సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారావు, జయరాజు, ఆవుల హనుమంతరావు, కరి కమలేశ్వరరావు, కె.వీరాంజనేయులు, ఉదయకుమారి, రాఘవరావులను సన్మానించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్షులుగా పేర్ని సత్యనారాయణ,ప్రధానకార్యదర్శిగా ఎస్‌కె. మస్తాన్‌వలి, కోశాధికారిగా ఎం.మాధవ ఎన్నికయ్యారు.

సంక్షిప్తంగా..

అదుపుతప్పి గుంతలోకి దూసుకుపోయిన లారీ

ఇంకొల్లు,నవంబరు 22,(ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి ఇంకొల్లుకు సిమెంట్‌బ్రిక్స్‌తో వస్తున్న లారీ శుక్రవారం వేకువజామున వంకాయలపాడు మార్కెట్‌యార్డు సమీపంతో అదుపు తప్పి గుంతలోకి దూసుకుపోయింది. రోడ్డు పక్కన వాకింగ్ చేస్తున్న కొత్తపల్లి శుశాంతును తగులుతూ పోవడంతో ఆయనకు స్వల్పగాయాలు కాగా చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శుశాంత్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.డ్రైవర్ సురేష్‌పై కేసు నమోదు చేసామన్నారు. ప్రమాదంలో లారీ పాక్షికంగా దెబ్బతినింది.



గుంతలోకి దూసుకుపోయిన లారీ

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

పర్చూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి అరెస్టు చేసినట్లు సీఐ భుజంగరావు తెలిపారు. పర్చూరు మండలం నూతలపాడు, ఇంకొల్లు మండలం వంకాలయలపాడుకు సంబంధించి ఇద్దరు వ్యక్తుల నుంచి అక్రమంగా నిల్వఉంచిన 22 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.